ఈనాడు
చిత్తూరు
శనివారం అక్టోబరు 5, 2024



మెట్లదారిలో.. హృదయ నివేదన విందాం

మొక్కు తీర్చుకోవాలన్న భక్తితత్పరత ఒకరిది.. మెట్టు మెట్టుకూ మోకరిల్లేది మరికొందరు.. ఉరుకుల పరుగుల జీవనంలో కాస్త ప్రత్యేకత కోరుకుంటూ కదిలివచ్చే కుటుంబాలు ఇంకొన్ని.. శేషాచల అందాలు ఆస్వాధిస్తూ సెల్‌ఫోన్‌లో వాటిని బంధిస్తూ ముందుకు సాగే యాత్రికులు మరో వైపు.. చిన్నారులు, యువత మొదలు మహిళలు, వృద్ధులతో శ్రీవారి మెట్ల మార్గాల్లో నిత్యం గోవింద నామస్మరణలు మిన్నంటుతున్నాయి. బ్రహ్మోత్సవ వేళ ఈ సందడి మరింత అధికంగా ఉండగా మదిలో ఓ విషయం గుర్తుంచుకోవాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, తిరుమల

అలవాటు లేకుంటే సాహసాలొద్దు

శ్రీవారి దర్శనార్థం భక్తులు వివిధ మార్గాల్లో తిరుమలకు చేరుకుంటారు. వాహనాల్లో వచ్చేవారికి మొదటి, రెండో ఘాట్ రోడ్లు అందుబాటులో ఉన్నాయి. నడకమార్గంలో అయితే తిరుపతి నుంచి అలిపిరి మీదుగా తిరుమలకు చేరుకోవచ్చు. ప్రస్తుతం శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులు పెద్దసంఖ్యలో ఈ మార్గం గుండానే చేరుకుంటుండటంతో తితిదే ఈ మార్గాన్ని అభివృద్ధి చేసింది. 3,650 మెట్ల దారిలో ఎక్కడికక్కడ తాగునీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు చేశారు. చంద్రగిరి వైపున ఉన్న



శ్రీవారి మెట్టు మార్గం మరోటి. ఇక్కడ 2,100 మెట్లు ఉండగా అలవాటున్నవారు గంటలోపే తిరుమలకు చేరుకోవచ్చు. ప్రతిరోజూ అలిపిరి మార్గంలో 10 నుంచి 15వేల మంది, శ్రీవారిమెట్టు మార్గంలో ఏడు నుంచి పదివేలమంది కొండపైకి చేరుకుంటున్నారు.

శారీరక సామర్థ్యం కీలకం

మెట్ల మార్గాల్లో ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేనివారికి, రోజువారీ వ్యాయామం చేసేవారికి ఎటువంటి ఇబ్బంది



ఉండదు. కొవిడ్ తరువాత గుండె సంబంధిత సమస్యలు అన్ని వయసుల వారికి వస్తున్న నేపథ్యంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. ఈ మార్గంలో ప్రతి నెలా ఇద్దరుముగ్గురు అనారోగ్యం బారిన పడటం, అందులో ఒకరు మృతిచెందడం వంటివి చోటుచేసుకుంటున్నాయి.

భక్తులకు కార్డియాక్ పరీక్షలు

నడకదారిలో బాధితులకు అత్యవసర వైద్యం అందించడంపై తితిదే ఉన్నతాధికారులు దృష్టిసారించారు. స్విమ్స్ ఆధ్వర్యంలో తితిదే విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ, పోలీసు సిబ్బందికి సీపీఆర్‌పై ఇప్పటికే పలు దఫాలుగా శిక్షణ ఇచ్చారు. అలిపిరి, శ్రీవారి మెట్టుమార్గాల వద్ద స్విమ్స్ వైద్యులతో కార్డియాక్ స్క్రీనింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

విశ్రాంతి తీసుకోవడం, బృందాలుగా వెళ్లడం మేలు



గుండె సర్జరీలు, ఇటీవల స్టంట్లు అమర్చుకున్నవారు, రక్తపోటు నియంత్రణలో లేనివారు, జ్వరపీడితులు, శ్వాసకోశ సంబంధిత జబ్బులతో బాధపడేవారు దూరంగా ఉండాలి. మిగిలినవారూ జాగ్రత్తలు పాటించాలి. ముందస్తుగా ఈసీజీ, టీఎంటీ వంటి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. అలసటకు గురైన సమయంలో సేద తీరాలి. గ్లూకోజ్ నీరు తాగుతూ హైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి. భక్తులు బృందాలుగా మాట్లాడుకుంటూ వెళ్లడంతో కొంత అలసట తగ్గే అవకాశం ఉంటుంది.

- డా.పీవీ హరీష్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రుయా

గంగమ్మ ఆలయ ఈవోగా జయకుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న జయకుమార్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా జయకుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో ఇక్కడే సీనియర్ అసిస్టెంట్ హోదాలో పని చేశారు. 2017 నుంచి 2019 వరకు రెడ్డమ్మ కొండ దేవస్థానం.. అనంతరం తలకోనలోని శ్రీ సిద్ధేశ్వర ఆలయ ఈవోగా విధులు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. త్వరలో ఆలయ పాలక మండలిని నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేసినట్లు సమాచారం.

బీఐవో ప్రత్యేక అధికారి జయచంద్రారెడ్డి తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

ఈనాడు-తిరుపతి: స్విమ్స్‌లోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీకి ప్రత్యేక అధికారిగా నియమించిన డా. ఎం.జయచంద్రారెడ్డిని తొలగిస్తూ స్విమ్స్ డైరెక్టర్, ఎస్వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వీసీ ఆర్.వి.రవికుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమించి అర్హత లేకున్నా నాటి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి బంధువు జయచంద్రారెడ్డిని బీఐవోకి ప్రత్యేక అధికారిగా నియమించారు. దీనిపై 'కొలువు సృష్టించి.. కట్టబెట్టి' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లింది. కన్సాలిడేటెడ్ చెల్లింపుల విధానం ద్వారా 2022లో ఆయన్ను నియమించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు మాత్రమే అతను పనిచేసేలా నాటి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని జయచంద్రారెడ్డిని బీఐవో ప్రత్యేక అధికారి పదవి నుంచి తొలగించారు. బాధ్యతలను తక్షణమే సర్జికల్ ఆంకాలజీ హెచ్‌వోడీ నరేంద్రకు అప్పగించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, సెక్షన్ల నుంచి నో డ్యూ సర్టిఫికెట్‌ను సమర్పించాలని స్పష్టం చేశారు.

7లోపు ధ్రువపత్రాల పరిశీలన

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: ఏపీ ఉన్నత విద్యా మండలి-2024 వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ పీజీసెట్-2024లో ర్యాంకులు పొంది ఎస్వీయూలో ఫేస్-2లో సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీ లోపు అడ్మిషన్స్ కార్యాలయంలో హాజరుకావాలని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతినాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు సర్టిఫికెట్లను పరిశీలించిన రోజునే రుసుం చెల్లించాలన్నారు.

అప్పగిస్తే.. చర్యలు వద్దంటూ..!

- రెవెన్యూ అధికారుల తీరిలా
- చెలరేగుతున్న ఇసుక మాఫియా
- ఇబ్బందుల్లో వీఆర్వో, వీఆర్‌ఏలు

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ఎక్కడైనా అనధికారికంగా ఇసుక, మట్టి, గ్రావెల్ వాహనాలు వెళ్తుంటే... క్షేత్రస్థాయిలో వీఆర్వోలు, వీఆర్‌ఏలు దాడి చేసి స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేస్తున్నారు. అనంతరం రెవెన్యూ శాఖలోని అధికారులు కేసును నీరు గార్చేలా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో డివిజన్‌లో మాఫియా చెలరేగిపోతోంది. చివరకు వీఆర్వోలు, వీఆర్‌ఏలు బలైపోతున్నారు.

■ సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్‌లో ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియా ఆగడాలు నిరంతరాయంగా సాగుతున్నాయి. దీని కట్టడికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా.. మండల స్థాయి రెవెన్యూ యంత్రాంగం తప్పిదంతో అది కాస్తా పక్కదారి పడుతోంది. ఇందుకు తాజాగా డివిజన్‌లో జరిగిన ఘటనలే ఉదాహరణ.. సూళ్లూరుపేట, పెళ్లకూరు, ఓజిలి, తడ, నాయుడుపేట, దొరవారిసత్రం, సత్యవేడు, వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియా పెచ్చుమీరింది. వీరు దొంగచాటుగా రేయింబవళ్లు పనికానిస్తున్నారు. మాఫియాకు ప్రజాప్రతినిధులు, తహసీల్దార్ల అండదండలు పుష్కలంగా ఉంటున్నాయి. వాహనాలను వీఆర్వోలు పట్టుకున్న వెంటనే నేతలు వారిపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఇందులో కొందరు నిక్కచ్చిగా విధులు నిర్వహిస్తూ.. వాహనాలను పోలీసు స్టేషన్ వరకు తీసుకెళ్లి అప్పగిస్తే.. వెంటనే మండల స్థాయి అధికారులకు అధికార పార్టీ నేతలు ఫోన్ చేసి, వాటిని వదిలి పెట్టాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు డివిజన్‌లో కోకొల్లలుగా ఉన్నాయి. దీంతో మాఫియా నాయకులు తప్పించుకుంటున్నారు.



తాజా ఘటనలు చూస్తే..

సూళ్లూరుపేట మండలంలోని ఇలుపూరు నుంచి గతనెల 27న ఇసుక ట్రాక్టర్ వస్తుండగా వీఆర్వో శ్రీదేవి పట్టుకున్నారు. పోలీసు రాణాకు తీసుకొస్తుండగా మార్గ మధ్యలో మండల తెదేపా అధ్యక్షుడు అడ్డుకున్నారు. అనంతరం మీడియా వెళ్లడంతో ట్రాక్టర్ పోలీసు రాణాకు చేరింది. దీనిపై వీఆర్వో ఫిర్యాదు చేశారు. నేతలు రంగంలోకి దిగి తహసీల్దార్‌పై ఒత్తిడి చేశారు. ఇక తహసీల్దారే స్వయంగా ఎస్సైకి ఫోన్ చేసి, ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించారు. ట్రాక్టర్‌కు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా వదిలిపెట్టగా వీఆర్వో ఫిర్యాదు బుట్టదాఖలు అయింది.

■ పెళ్లకూరు మండలంలోని చెంబడిపాళెంలోని సీజేఎఫ్ఎస్ భూముల నుంచి మట్టి తవ్వకాలు జరుపుతుండగా వీఆర్వో, ఆర్‌ఐ పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలిస్తుండగా అధికారపార్టీకి చెందిన ముఖ్యనేత ఫోన్ చేసి వదిలిపెట్టాలని హుకుం జారీ చేశారు. దాంతో తహసీల్దార్ వాటిని వదిలిపెట్టారు. నేటికీ అక్కడ మట్టి తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. అలాగే కప్పగుంట, కల్వకూరు సమీపాన ఇసుక ట్రాక్టర్లను వీఆర్వో దాడి చేసి స్వాధీనం చేసుకుంటే.. అధికారపార్టీ నేతలు దుర్భాషలాడారు.

■ తడ మండలంలోని కాసింఖాన్‌కండ్రిగ, మాంబట్టు చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుపుతున్నాయని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే అసలు అక్కడకు వెళ్లలేనే లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

■ ఎన్నికల సమయంలో కోళ్లమిట్ట వీఆర్వో దివ్య ఓ మట్టి ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో ఆమెకు వైకాపా నేతల నుంచి ఎన్ని బెదిరింపులు వచ్చినా లెక్కచేయక కేసు పెట్టారు. అయితే రాణాలో అప్పటి ఎస్సై ఫిర్యాదులోని సారాంశాన్ని పరిగణనలోకి తీసుకోక ఇష్టానుసారంగా కేసు నమోదు చేశారు. దీనిపై అప్పటి తహసీల్దార్ గోపాలకృష్ణ ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు కూడా ఫిర్యాదు చేసిన దాఖలాలు ఉన్నాయి.

తితిదేకి బీమా పరిహారం చెల్లించాలని ఫోరం ఆదేశం

తిరుపతి (లీగల్): తితిదేకి బీమా పరిహారం చెల్లించాలని తిరుపతి జిల్లా వినియోగదారుల ఫోరం బెంచ్ గత నెల 30న ఉత్తర్వులు జారీ చేసినట్లు తితిదే తరపు న్యాయవాది కె.రాజేష్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. తితిదేకి సంబంధించిన ఆలయాల్లోని బంగారు ఆభరణాలకు యునైటెడ్ ఇండియా బీమా సంస్థ ద్వారా బీమా చేయించారు. 2009లో తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలోని నగలు చోరీ అయ్యాయి. దీనిపై తిరుపతి పడమర పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొన్ని నగలు రికవరీ చేయగా.. రూ. 2,43,480 విలువైన నగలను పోలీసులు రికవరీ చేయలేకపోయారు. పాలసీ ప్రకారం పైకం చెల్లించాల్సిందిగా తితిదే బీమా సంస్థని కోరింది. సంస్థ నిరాకరించటంతో ఫోరంలో ఫిర్యాదు దాఖలు చేశారు. సేవా లోపానికి పాల్పడిన బీమా సంస్థ తితిదేకి బీమా పరిహార పైకం రూ. 2,43,480, సేవా లోపం కింద రూ.లక్ష, రూ.10వేలు ఫిర్యాదు దాఖలు ఖర్చు 45రోజుల్లో చెల్లించాల్సిందిగా ఆదేశించింది.



నాడు-నేడు ఫొటో ప్రదర్శనను తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరికి వివరిస్తున్న తితిదే సీపీఆర్వో టి.రవి, సీనియర్ ఫొటోగ్రాఫర్ శేఖర్




తితిదే నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రి ఆనం తదితరులు













పుష్ప ప్రదర్శనశాల ప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: స్థానిక కల్యాణవేదిక వద్ద ఏర్పాటుచేసిన పుష్ప ప్రదర్శనను తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరిలు శుక్రవారం ప్రారంభించారు. ప్రదర్శన ప్రవేశ మార్గంలో ఉంచిన దుర్యోధన పరాభవం, అటవీశాఖ ఏర్పాటుచేసిన శేషాచల శ్రేణుల సెట్టింగ్, తితిదే ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ శిల్పకళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన చెక్క, సిమెంట్, రాయి, లోహ శిల్పాలను పరిశీలించారు. తితిదే ప్రజాసంబంధాలశాఖ ఆధ్వర్యంలో నాడు-నేడు కాన్సెప్ట్‌తో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ని, తిరుమల దేవాలయం, ఇతర ముఖ్యమైన అంశాలకు సంబంధించిన అరుదైన నాటి ఫొటోలను ఇందులో ప్రదర్శించారు. వివిధ శాఖల వారీగా ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి అభినందించారు. సీవీఎస్‌వో శ్రీధర్, ఉద్యానవనశాఖ డీడీ శ్రీనివాసులు, తితిదే డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఎస్వీ ప్రిన్సిపల్ వెంకట్రమణారెడ్డి, సీపీఆర్వో టి.రవి తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు చేపడుతున్న రవినాయుడు, చిత్రంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ ఎండీ గిరీశ తదితరులు

శాప్ ఛైర్మన్‌గా రవినాయుడు బాధ్యతల స్వీకరణ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్‌గా అనిమిని రవినాయుడు బాధ్యతల స్వీకరణ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. స్థానిక ఐజీఎంసీ స్టేడియం వద్ద గల శాప్ కార్యాలయానికి ఆయన ఊరేగింపుగా తరలివచ్చారు. రవినాయుడు దంపతులను వేదపండితులు పూర్ణకుంభంతో కార్యాలయంలోకి స్వాగతం పలికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి సమక్షంలో శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీఎస్ గిరీశ పుష్పగుచ్ఛాన్ని అందించి బాధ్యతల స్వీకరణ దస్త్రంలో సంతకం చేయించారు. రవినాయుడు మాట్లాడుతూ.. ప్రతి సోమవారం శాప్ కార్యాలయంతో పాటు డీఎస్‌ఏల్లో కూడా క్రీడాకారులు, వారి తల్లిదండ్రుల నుంచి వినతులు స్వీకరించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ వైభవాన్ని వ్యాప్తి చేయండి



మాట్లాడుతున్న తితిదే ఈవో జె.శ్యామలరావు, చిత్రంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, సీవీఎస్‌వో శ్రీధర్, సీపీఆర్వో టి.రవి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి నవాహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాల వైభవాన్ని విశ్వవ్యాప్తంగా తీసుకెళ్లాలని మీడియా ప్రతినిధులకు తితిదే ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రాంభగీచా-2లోని మొదటి అంతస్తులో మీడియా సెంటర్‌ను ప్రారంభించారు. ఈవో మాట్లాడుతూ.. శ్రీవేంకటేశ్వర స్వామి వైభవాన్ని, యాత్రికులకు తితిదే అందిస్తున్న సౌకర్యాలను బయటి ప్రపంచానికి విస్తృతంగా తీసుకెళ్లడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. సీపీఆర్వో డా.టి.రవి, పీఆర్వో పి.నీలిమ పాల్గొన్నారు.

భూమనకే సనాతన ధర్మంపై మాట్లాడే అర్హత లేదు

ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారి నిధులు దుర్వినియోగపరిచి, ప్రసాదాల్లో నాసిరకం సరకులు ఉపయోగించడమే కాకుండా కల్తీ నెయ్యికి కారకులు కరుణాకర్ రెడ్డేనని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కరుణాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. భూమన తన చరిత్ర మరిచి మాట్లాడుతున్నారని, 40 ఏళ్ల కిందటే తిరుపతిలో రౌడీయిజానికి పునాది వేసింది ఆయన కుటుంబమేనని ఆరోపించారు. శ్రీవారిని నల్లరాయి అన్న కరుణాకర్ రెడ్డికి సనాతన ధర్మం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. జనసేన ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాట్లాడుతూ కరుణాకర్ రెడ్డి చరిత్రంతా అవినీతిమయమేనని, జగన్‌ను అధఃపాతాళానికి తొక్కేస్తానని పవన్ కల్యాణ్ చెప్పిన ప్రకారం చేశారని, ఆయన చంకలో చంటిబిడ్డ కాదని, వైకాపా నేతల పాలిట చురకత్తిలాంటి వారని భూమన విమర్శలను తిప్పికొట్టారు.

పవన్ కల్యాణ్ మాట్లాడిన ప్రతి మాటా అక్షర సత్యం

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: పవన్‌కల్యాణ్ వారాహి సభలో మాట్లాడిన ప్రతి మాటా అక్షర సత్యమని, పవన్ మాటలకు వైకాపా కూసాలు కదులుతున్నాయని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో తిరుమలలో శ్రీవారికి అపచారం జరిగిందని ఆరోపించారు. లడ్డూ కల్తీ విషయంలో వాస్తవాలు వెలికి తీయాలన్న సంకల్పంతో సుప్రీం ధర్మాసనం ఐదు మంది సభ్యులతో కూడిన కమిటీని భాజపా స్వాగతిస్తోందన్నారు. సమావేశంలో వరప్రసాద్, అజయ్‌కుమార్, డా.శ్రీహరి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతన్నల గజగజ

❖ పంటలపై ఏనుగుల దాడులు ❖ ఉమ్మడి జిల్లాలోని అన్నదాతలకు ఇబ్బందులు



నాలుగు రోజుల కిందట పుల్లావాండ్లపల్లిలో ఏనుగులు తొక్కేసిన వరి

పాకాల, న్యూస్‌టుడే: చేతికొచ్చిన పంటలపై గజరాజులు వరుస దాడులు చేస్తూ అన్నదాతలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రధానంగా కౌండిన్య అభయారణ్యం, శేషాచలం నుంచి వస్తున్న ఏనుగులు వారానికోసారి వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పంటలను అటవీశాఖ అధికారులు పరిశీలించి మొక్కుబడిగా నష్టపరిహారం అందిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల దాడులతో పొలాలను బీడు భూములుగా వదిలేయాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు.

జరిగిన ఘటనలివీ..

❖ గత ఫిబ్రవరి, మార్చిలో 17 ఏనుగులు తిరుపతి జిల్లా పాకాల, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, చిత్తూరు జిల్లాలోని పులిచెర్ల, సదుం, సోమల, ఐరాల మండలాల్లో స్వైరవిహారం చేసి వందలాది ఎకరాల్లో పంటను నాశనం చేశాయి. ❖ జనవరిలో పులిచెర్ల మండలంలో ఓ రైతును, నాలుగు నెలల కిందట పాకాల మండలం, చెన్నుగారిపల్లి సమీపంలో ఓ వ్యక్తిని తొక్కి చంపేశాయి. ❖ వారం రోజుల్లో రెండు సార్లు నడింపల్లి, కొండకిందపల్లి, పుల్లావాండ్లపల్లి పరిసరాల్లో వరి పొలాలను తొక్కి ధ్వంసం చేశాయి. ❖ ఈ ఏడాది ఆరంభంలో చంద్రగిరి మండలంలో నెల రోజుల పాటు తిష్ఠవేసిన ఏనుగులు పంటలను నాశనం చేశాయి. ❖ పాకాల మండలంలో పలు దఫాలుగా గజరాజుల దాడులు కొనసాగుతున్నాయి.

మొక్కుబడిగా పరిహారం

గతేడాది మార్చిలో పదిపుట్లబైలు ప్రాంతంలో ఏనుగు దాడిలో నష్టపోయిన రైతులకు అటవీ అధికారులు పరిహారం మొక్కుబడిగా అందించారు. మిగతా బాధితులు దరఖాస్తు చేసుకున్నా వారికి మాత్రం ఇప్పటి వరకు పైసా రాలేదు. చిన్నగొట్టిగల్లు మండలంలో నష్టాలపాలైన రైతులు ఇప్పటికీ పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఇప్పటివరకు దరఖాస్తుల మేర 100 మందికి పైగా రైతులకు రూ.10లక్షల పరిహారం అందించాం. మరో వారంలో 48 మందికి పరిహారం అందించబోతున్నాం. దాడులకు సంబంధించి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపుతున్నాం. ఏనుగుల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

- భారతి, ఫారెస్ట్ సెక్షన్ అధికారిణి, పాకాల

చేతికొచ్చిన పంటను నాశనం చేశాయి



నాలుగు రోజుల కిందట పొలాలపై పడిన ఏనుగులు రెండు ఎకరాల్లో వరి పొలాన్ని తొక్కేశాయి. రూ.50 వేలు అప్పు చేసి పెట్టుబడి పెట్టా. ఈ విషయాన్ని అటవీ అధికారులకు చెప్పినా స్పందన కరవైంది. పొలం వద్దకు కాపలా వెళ్లాలన్నా భయంగా ఉంది. ఏనుగుల దాడులతో పొలాలను బీడుగా వదిలేయాల్సిన దుస్థితి దాపురించింది.

- నరసింహులు, రైతు, పుల్లావాండ్లపల్లి

ఏనుగుల బెడద నివారించాలి



ఏనుగుల దాడుల కారణంగా పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. గత రెండేళ్లలో మూడు సార్లు పంటను నష్టపోయా. స్థానిక అధికారులు, నాయకులు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. నష్టానికి సరిపడా పరిహారాన్ని రైతులకు అందించాలి.

- జయచంద్ర, రైతు, కొండకిందపల్లి

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: కనుమ దారిలో, ప్రమాదకర మలుపుల్లో డ్రైవర్లు తగిన జాగ్రత్తలు పాటించడంతో పాటు అప్రమత్తతతో ప్రమాదాలు నివారించవచ్చని సామాజిక కార్యకర్త, న్యాయవాది, ప్రమాదాల విశ్లేషక నిపుణులు ఎం.బాలాజీ పేర్కొన్నారు. తిరుపతిలోని జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు చెందిన 90 మంది బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. పలు అంశాలపై డ్రైవర్లకు శిక్షణ కల్పించారు. డ్రైవింగ్‌లో పరిమిత వేగాన్ని అనుసరించాలని, తద్వారా ప్రయాణికులను సురక్షితంగా వారివారి గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి, వివిధ డిపోల మేనేజర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న న్యాయవాది ఎం.బాలాజీ

డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి బదిలీ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: జిల్లా అటవీశాఖాధికారి(డి.ఎఫ్.ఓ) చైతన్యకుమార్‌రెడ్డిని బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన్ను.. ఆ శాఖ రాష్ట్ర సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. ఆయనపై ఆరోపణల నేపథ్యంలో ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఆయన స్థానంలో కాకినాడ డీఎఫ్‌వో భరణిని ఇక్కడ నియమించింది.

క్రిమినల్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మహిళా వర్సిటీ(తిరుపతి): నూతన క్రిమినల్ చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని సీఐ మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ న్యాయ కళాశాల ఆధ్వర్యంలో పోలీస్ శిక్షణా కళాశాల తిరుపతి సిబ్బంది న్యాయ విద్యార్థినులకు నూతన క్రిమినల్ చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సైబర్ నేరాలు, రక్షణా చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేష్, అశ్విన్, దివ్య, న్యాయ విభాగం ఆచార్యులు సీతాకుమారి, ఇందిర పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారి

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



సంపత్ (పాత చిత్రం)

సత్యవేడు, న్యూస్‌టుడే: తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి సంపత్(36) అనే యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కోమటిగుంటలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సంపత్ ఇంటి ముందు ఉన్న విద్యుత్ తీగలు తెగి ఇంటి ఆవరణలోని కంపపై పడడంతో విద్యుత్ స్తంభం వద్ద మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో దీపాలు, వీధి దీపాలు వెలగకపోవడంతో సంపత్ బయటకు రావడంతో కంపపై ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామస్థులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా సంపత్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని బాధితులు, కుటుంబ సభ్యులు శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. పోలీసులు బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కూలీతో ఇద్దరు పిల్లలు తాము ఎలా బతకాలని భార్య కన్నీటిపర్యంతమైంది.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా శుక్రవారం సాయంత్రానికి క్యూలైన్లలో వచ్చిన భక్తులకు దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 టికెట్లు కలిగిన వారికి మూడు గంటల సమయం పడుతోంది. గురువారం శ్రీవారిని 63,376 మంది దర్శించుకోగా రూ.3.56 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

వైకల్యం శరీరానికే.. మనసుకు కాదు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వైకల్యం శరీరానికే తప్ప.. మనసుకు కాదని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని చెప్పారు. దీనిలో భాగంగా ఫ్రీడం ట్రస్ట్ అధినేత సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో 208 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కటి రూ.15 వేలు విలువ చేసే 218 కృత్రిమ కాళ్లు అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాస్, ఉప మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



దివ్యాంగుడికి కృత్రిమ కాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

టెట్‌కు 445 మంది హాజరు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: టెట్ రెండోరోజు శుక్రవారం జిల్లాలో రెండు కేంద్రాలు, చెన్నైలో ఒక కేంద్రంలో నిర్వహించారు. ఉదయం 231మంది అభ్యర్థులకు గాను 209మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 278మందికి గాను 236మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. చెన్నై కేంద్రంలో 46మంది పరీక్ష రాయాల్సి ఉండగా 37మంది హాజరు కాగా.. మిగిలిన వారు జిల్లాలోని మదర్ థెరెసా, ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలోని కేంద్రంలో పరీక్షకు హాజరయ్యారు.

ధ్వజగోవిందం.. శేషారవిందం

తిరుమల, న్యూస్‌టుడే:

ఇల వైకుంఠం పులకించింది.. భక్త సంద్రంలో ఓలలాడింది. గోవింద నామస్మరణలు మిన్నంటిన వేళ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6 గంటల మధ్య మీనలగ్నం శుభముహూర్తంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా గరుడ పటాన్ని ఊరేగించి బ్రహ్మాది దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి సమక్షంలో ఎగురవేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు పట్టువస్త్రాలను మూలమూర్తికి సమర్పించారు. పెద్దశేష వాహనసేవలో పాల్గొన్నారు. స్వామివారు తొలి వాహనమైన ఏడు పడగల ఆదిశేషునిపై ఉభయ దేవేరులతో పరమపద వైకుంఠ నాథుని అలంకారంలో తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయప్రదానం చేశారు.



పట్టువస్త్రాలు తెస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



ధ్వజారోహణ కార్యక్రమంలో హారతి ఇస్తున్న అర్చకులు



పెద్దశేషవాహనంపై దేవేరులతో శ్రీవారు



వాహన సేవను తిలకిస్తున్న జీయంగార్లు

నేడు చిన్నశేష, హంస వాహన సేవలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం చిన్నశేష, హంస వాహన సేవలు జరగనున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 8 నుంచి 10 గంటల వరకు చిన్నశేష వాహనసేవ, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపన తిరుమంజనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహనసేవ జరగనుంది.





ఆకట్టుకున్న ప్రదర్శనలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తితిదే ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో 14 కళా బృందాల్లో 410 మంది పాల్గొన్నారు. కళాకారులు తమ అద్భుత ప్రదర్శనలతో భక్తులకు నయనానందాన్ని కలిగించారు.

వేడుకగా ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు











మళ్లీ.. ఆ పాత స్టాంపు పత్రాలు

త్వరలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులోకి

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో సరఫరా నిలిచిన నాన్ జ్యుడీషియల్ స్టాంపు పత్రాలు మళ్లీ రానున్నాయి.. నాసిక్‌లో ముద్రించే వీటిని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని స్టాంపులు అవసరమనే దానిపై అధికారులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా వివరాలు సేకరించి 11 లక్షల స్టాంపులకు ఇండెంట్ పెట్టినట్లు సమాచారం. ● జిల్లాలో ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. చివరగా 2022 ఆగస్టులో జిల్లాకు రూ.100, రూ.50 విలువ చేసే స్టాంపు పత్రాలు సరఫరా అయ్యాయి. తర్వాత నాసిక్ నుంచి స్టాంపుల సరఫరా నిలిచిపోవడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొరత ఏర్పడింది. దీంతో రిజిస్ట్రేషన్లతో పాటు ఒప్పందాలు, అఫిడవిట్, ఇతర లావాదేవీలకు నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత కారణంగా వినియోగదారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. జిల్లాకు రూ.100 విలువ చేసే నాన్ జ్యుడీషియల్ స్టాంపులు 5 లక్షలు, రూ.50 విలువ చేసే స్టాంపులు నాలుగు లక్షలు, రూ.20 స్టాంపులు రెండు లక్షలు అవసరమని అధికారులు అంచనా వేశారని సమాచారం.



నాన్ జ్యుడీషియల్ స్టాంపు పత్రం

విక్రేతల దందా..

స్టాంపుల కొరత నేపథ్యంలో అప్పట్లో కొందరు స్టాంపు పత్రాల విక్రేతలు కక్షిదారుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తూ దందా సాగించారు. తర్వాత గత ప్రభుత్వ ఈ-స్టాంపింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

ఈ-స్టాంపు పత్రంపై అనాసక్తి..

ఈ-స్టాంపింగ్ విధానంపై స్థిరాస్తుల క్రయ, విక్రయదారుల్లో అనాసక్తి నెలకొంది. ఫిజికల్ నాన్ జ్యుడీషియల్ స్టాంపు పత్రాలతో పోలిస్తే. . ఈ-స్టాంపు పత్రాలు జిరాక్సు కాగితంలా ఉండటంతో చాలామంది వీటిపై ఆసక్తి చూపలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం మళ్లీ ఫిజికల్ నాన్ జ్యుడీషియల్ స్టాంపు పత్రాలు తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతోంది.

పండగ వేళ.. శుభవార్త

- ధూప, దీప నైవేద్య సాయం పెంపుపై ఉత్తర్వు
- జిల్లాలోని 209 ఆలయాలకు వర్తింపు

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: దసరా పండుగ వేళ ఎన్నికల హామీ అమలుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆదాయం లేని చిన్న ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాలు నిర్వహించేందుకు అందించే సాయాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంలో జిల్లాలోని 209 ఆలయాలకు ప్రతినెలా రూ.10 వేల చొప్పున అందనుంది. ఆదాయం లేని చిన్న ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు నిత్యం దీపం వెలిగించి, నైవేద్యం పెట్టేందుకు ధూప, దీప, నైవేద్యం పథకం (డీడీఎన్ఎస్) అమలు చేస్తున్నారు. గతంలో నెలకు రూ.2,500 చొప్పున అందిస్తుండగా 2015లో తెదేపా ప్రభుత్వం దీన్ని రూ.5 వేలకు పెంచింది. అయితే పెరిగిన ఖర్చుల నేపథ్యంలో ఈ సాయాన్ని రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు కూటమి నేతలు హామీఇచ్చారు. ఈ మేరకు తాజాగా సాయాన్ని రూ.10 వేలకు పెంచుతూ దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఉత్తర్వు జారీచేశారు. ఇందులో రూ.7 వేలు అర్చకుడికి భృతిగా, రూ.3 వేలు.. ధూప, దీప, నైవేద్యానికి వినియోగించాల్సి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ నగదును ప్రతినెలా అర్చకుడి ఖాతాలో ఆన్‌లైన్ ద్వారా జమ చేయనున్నారు.

ఆలయాల వర్గీకరణ

జిల్లాలో 6(ఏ) పరిధిలో కాణిపాకం శ్రీ స్వయంభు వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం, బోయకొండ గంగమ్మ దేవస్థానం, నగరి దేశమ్మ ఆలయం, అర్ధగిరి వీరాంజనేయస్వామి దేవస్థానం, బంగారుపాళ్యం మండలంలోని మొగిలీశ్వర దేవస్థానం ఉన్నాయి. వీటి వార్షికాదాయం రూ.25 లక్షలకు పైబడి ఉంది. 6(బి) ఆలయాలు 41 ఉన్నాయి. వీటి ఆదాయం రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఉంది. వీటి నుంచి నిధుల్ని వసూలు చేస్తున్నారు. జిల్లాలో రూ.2 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న ఆలయాలు 1,200 వరకూ ఉన్నాయి.

నిబంధనలతో చాలా ఆలయాలు దూరం..

ధూప, దీప నైవేద్యం పథకం లబ్ధికి.. ప్రభుత్వం విధించిన నిబంధనలతో చాలా ఆలయాలు దూరమవుతున్నాయి. పల్లె ప్రాంతాల్లోని ఆలయాలకు మాత్రమే దీన్ని వర్తింపజేస్తున్నారు. ఆలయానికి భూములు పదెకరాలలోపు ఉండాలి. ధ్వజస్తంభం ఉండాలి. ఇంకా అనేక నిబంధనలు ఉన్న కారణంగా చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు.

రబీ సీజన్‌కు 1,746 క్వింటాళ్ల విత్తు కేటాయింపు

చిత్తూరు (వ్యవసాయం): రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను రాష్ట్ర వ్యవసాయశాఖ కేటాయించింది. జిల్లాలోని నగరి, నింద్ర, విజయపురం మండలాలకు వేరుసెనగ విత్తు 1,681 క్వింటాళ్లు, ఉద్దులు 46 క్వింటాళ్లు, పెసలు 35 క్వింటాళ్లు, నువ్వులు 14 క్వింటాళ్లు.. మొత్తం 1,746 క్వింటాళ్లు కేటాయిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని జేడీఏ మురళీకృష్ణ తెలిపారు. నిర్దేశిత లక్ష్యం ప్రకారం మండలాలకు విత్తు సరఫరా చేయాలని శ్రీకాళహస్తిలోని ఏపీ విత్తన సంస్థకు నివేదించామన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా సమగ్రాభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంటరీ రూపకల్పన నిమిత్తం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో.. జిల్లా అధికారులు, ఎన్జీవోలు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వన సంరక్షణ సమితి, ఎఫ్‌పీవోలు, రైతులు, జిల్లా సమాఖ్య సభ్యుల సలహాలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న ఐదేళ్లు, 2047 నాటికి జిల్లా అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై డాక్యుమెంటరీ సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. వైద్య సదుపాయాల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యాన, పశుసంపద, పరిశ్రమల అభివృద్ధిపై సూచనల్ని సమర్పించాలన్నారు. జిల్లా స్థాయి ప్రణాళిక ఈ నెల 15 నాటికి సిద్ధం చేయాలన్నారు. జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉద్యాన పంటల వృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్, డెయిరీ అభివృద్ధి, యూనివర్సిటీల ఏర్పాటు జరగాలని పేర్కొన్నారు. చిత్తూరు నగరాభివృద్ధికి కమిటీల్ని ఏర్పాటు చేసి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని సభ్యులు సూచించారు. జేసీ విద్యాధరి, సీపీవో సాంబశివారెడ్డి, గృహ నిర్మాణ పీడీ పద్మనాభం, డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు పీఎం కిసాన్ నిధుల విడుదల

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన కింద 18వ విడత నిధులను కేంద్ర ప్రభుత్వం శనివారం విడుదల చేయనుంది. రానున్న రబీ సీజన్‌కు పెట్టుబడి సాయంగా ఈ పథకం కింద రైతుల ఖాతాకు రూ.2 వేలు జమ చేయనుంది. జిల్లాలో సుమారు 1.75లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఈ పథకం కింద రైతులు లబ్ధి పొందాలంటే ఈకేవైసీ తప్పక చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. లబ్ధిదారుడు కచ్చితంగా తమ ఆధార్‌ను బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇసుక ఉచితమేదీ..?

- ధరల మోత
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇదీ పరిస్థితి



నాగలాపురం రీచ్‌లో ట్రాక్టర్లకు నింపుతున్న ఇసుక (పాత చిత్రం)

పుత్తూరు పట్టణానికి చెందిన అమర్‌నాథ్ ఏడాది క్రితం ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. గత వైకాపా ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక రూ.4800 కొనుగోలు చేశాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉచితంగా అందిస్తారని ఆశించాడు. దీంతో ఇంటి నిర్మాణాన్ని ఆలస్యం చేశాడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఇప్పటి వరకు ఉచిత ఇసుకకు సంబంధించి విధివిధానాలు ఖరారు కాలేదు. దీంతో ప్రస్తుతం అదే ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఇసుక తరలింపు అంతా నేతల కన్నుసన్నల్లోనే సాగుతోంది. ఇందుకు తార్కాణం సూళ్లూరుపేటలో వీఆర్వోను బెదిరించి ఇసుక ట్రాక్టర్‌ను తీసుకెళ్లడమే.

పుత్తూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇసుక రీచ్‌ల్లో నిల్వలు ఖాళీ కావడంతో ప్రైవేటు ట్రాక్టర్లు, టిప్పర్లదే రాజ్యం. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ధరకే ప్రస్తుతం ఇసుక అందుబాటులో ఉంది. ఆరు నెలలుగా ఉచిత ఇసుకపై గుత్తేదారులు, సొంత ఇంటి నిర్మాణదారులు ఆశలు పెట్టుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచితంగా లభిస్తుందని భావించారు. ఇందుకు తగ్గట్టు కలెక్టర్లు సైతం నూతన విధానంపై ప్రకటనలు చేశారు. నెలలు గడుస్తున్నా విధివిధానాలు ప్రకటించకపోవడంతో నిర్మాణదారులు గత పాలసీనే శరణ్యమని అప్పటి ఇసుక తరలింపు ట్రాక్టర్లు, టిప్పర్ల యజమానులను ఆశ్రయిస్తుండటంతో ఇదే అదనుగా వారు ధర తగ్గించేందుకు నిరాకరిస్తున్నారు. ఈ కారణంగా కొందరు నిర్మాణ పనులను వాయిదా వేస్తుండగా మరికొందరు జాప్యం చేస్తున్నారు.

బరి తెగింపు..

గతంలో అధికారికంగా ఇసుకను అవసరాలను బట్టి అత్యధిక ధర నిర్ణయించి విక్రయించేవారు. అనధికారికంగా రూ.కోట్లు విలువైన ఇసుక దారిమళ్లింది. వైకాపా నాయకులు స్థానికంగా లభించే ఇసుకను రీచ్‌లుగా మలుచుకుని అక్రమార్జనకు అలవాటుపడ్డారు. ప్రతి మండలంలో ప్రత్యేకంగా నాయకులు తయారై అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యాపారం ద్వారా వందలాది మంది వైకాపా నాయకులను స్థితిమంతులయ్యారు. దిఅదే పంథా ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో కొనసాగుతోంది. నారాయణవనం, నాగలాపురం, తిరుపతి గ్రామీణ మండలంలోని గొల్లపల్లి, చంద్రగిరి, చిత్తూరు, జీడీనెల్లూరు, పలమనేరు, పుంగనూరు, గూడూరు, కోట, వాకాడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, సూళ్లూరుపేట మండలాల్లో విరివిగా ఇసుక అక్రమ రవాణా చేశారు. స్వర్ణముఖి తీర ప్రాంతాల్లో ఇతర నదీ పరివాహక ప్రాంతాలు, ఆయకట్టు ప్రాంతాల్లో ఉన్న లక్షల టన్నులు కర్ణాటక, తమిళనాడుకు తరలించి రూ.కోట్లు ఆర్జించారు. ప్రస్తుతం తనిఖీలు తగ్గుముఖం పట్టడంతో బహిరంగంగా తరలిస్తున్నారు.

రీచ్‌లు ఇవీ..

గత ప్రభుత్వ హయాంలో చిత్తూరు జిల్లాలో నగరి, కార్వేటినగరం, జీడీనెల్లూరు, చిత్తూరు పరిధిలోని దిగుమాసాపల్లి, పాలూరు, తిరుపతి జిల్లాలో గూడూరు, వాకాడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, నాగలాపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి టిప్పర్ల ద్వారా సరఫరా చేశారు. ఈ ముసుగులో వైకాపా నాయకులు ఇతర రాష్ట్రాలకు తరలించి రూ.కోట్లు దండుకున్నారు. ప్రస్తుతం సైతం కొందరు అధికార పార్టీ నాయకులు ఇలానే చేస్తున్నారు. దీంతో ధరలో తేడా కనబడటం లేదు. గత ప్రభుత్వ హయాంలో స్వర్ణముఖి, కుశస్థలి నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఇసుక తరలించేశారు. ప్రస్తుతం రీచ్‌లలో అంతంత మాత్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు చేపట్టి ఉచితానికి సంబంధించి విధివిధానాలు ప్రకటించి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.



సంచరిస్తున్న ఏనుగులు

పంటలపై గజరాజుల దాడులు

డ్రోన్లతో గుర్తించి తరిమిన అధికారులు

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో పొలాలపై దాడులకు పాల్పడుతున్న ఏనుగుల గుంపును అటవీ అధికారులు డ్రోన్ కెమెరాలతో గుర్తించి అటవీ ప్రాంతంలోకి మళ్లించారు. ఈ తరహాలో డ్రోన్ కెమెరాలు వినియోగించడం ఇదే తొలిసారి. నాలుగు రోజులుగా తూర్పు అటవీ ప్రాంత గ్రామాలైన దేవళంపేట, పాళెం పంచాయతీల్లో ఏనుగుల మంద పొలాలను ధ్వంసం చేస్తోంది. గురువారం మరోసారి బోడ్రెడ్డిగారిపల్లె పంచాయతీ ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె వరి పైరును ఏనుగుల గుంపు తొక్కి నాశనం చేసింది. రాత్రి అటవీ అధికారులు డ్రోన్ కెమెరాలతో జల్లెడ పట్టి 12 పెద్ద ఏనుగులు, నాలుగు గున్నలతో ఓ మంద ఉన్నట్లు గుర్తించారు. వాటిని తూర్పు ప్రాంతం నుంచి పడమర అటవీ భాగంలోకి తరిమేశారు.

గణనాథుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ అరవింద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.వి.అరవింద్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, అర్చకులు రాజగోపురం వద్ద స్వాగతం పలికారు. వారు స్వామి వారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, తహసీల్దార్ మహేష్‌కుమార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్, చిత్తూరు న్యాయస్థాన సిబ్బంది ఉన్నారు.

మొదటి అడుగు.. కృత్రిమ కాలితోనే

కంటతడి పెట్టిన తల్లిదండ్రులు, నిర్వాహకులు


లేని తన కాలిని చూసుకుంటున్న చిన్నారి జెక్షిత్


నడవలేని స్థితిలో..


కుమారుడి దీనస్థితి చూసి విలపిస్తున్న తల్లిదండ్రులు


బాలుడికి కృత్రిమ కాలు అమర్చుతున్న ట్రస్టు నిర్వాహకులు


కృత్రిమ కాలు అమర్చిన అనంతరం జీవితంలో మొదటి సారి అడుగులు వేస్తూ..

బుడిబుడి అడుగులతో పరుగులు తీస్తూ అందరినీ పరుగెత్తించే వయసు.. నడుస్తూ.. ఆడుతూ కిలకిల నవ్వులతో మురిపించే మనస్తత్వం.. కానీ రెండున్నరేళ్ల వయసున్న ఆ చిన్నారిని విధి చిన్నచూపు చూసింది.. పుట్టుకతోనే పోలియో రావటంతో వీటన్నింటికి దూరమయ్యాడు చిత్తూరు జిల్లా యాదమరి మండలం కొటాలం గ్రామానికి చెందిన జెక్షిత్. చిత్తూరు నగరంలోని అంబేడ్కర్ భవనంలో 208 మందికి రూ.30 లక్షల విలువ చేసే కృత్రిమ కాళ్లు, సంతకొయ్యలు, వాకర్స్‌ను చెన్నైకి చెందిన ఫ్రీడం ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా అందజేశారు. దీంతో ఈ ఏడాది జులైలో జెక్షిత్‌తో పాటు వచ్చిన తల్లిదండ్రులు ప్రదీప్, ఈశ్వరి.. బాలుడి కాలికి కొలతలు ఇవ్వడంతో తాజాగా వారికి నిర్వాహకులు కృత్రిమ కాళ్లు అందజేశారు. వాటిని తీసుకునేందుకు చిన్నారితోపాటు తల్లిదండ్రులు చిత్తూరుకు వచ్చారు. జెక్షిత్‌కు కుడికాలు లేకపోవటంతో కాలి అంచుల్లో వేళ్లతో పట్టుకుని లాగుతుండటం అటు తల్లిదండ్రులు.. ఇటు నిర్వాహకులు విషణ్ణవదనులయ్యారు. ఇప్పటి వరకు ఒక్క అడుగు వేయని ఆ బాలుడికి కృత్రిమ కాలు అమర్చిన వెంటనే తండ్రి ప్రదీప్ బాలుడికి ఇప్పుడు వారితో అడుగులు వేయిస్తూ దృశ్యాలు చూపరుల కళ్లు చెమర్చాయి. పుట్టినప్పటి నుంచి అడుగులు వేయటం ఇదే మొదటిసారి అని, అదీనూ కృత్రిమ కాలు సాయంతోనే అని వారు కంటతడి పెట్టారు. ఇప్పటివరకు పింఛను రాలేదని, తమ కుమారుడికి పింఛను మంజూరు చేయించాలని వారు అధికారులకు విన్నవించారు.

- ఈనాడు, చిత్తూరు

బాధ్యతల స్వీకరణ


బాలకృష్ణ

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరుగా బి.బాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కడపలోని జడ్పీ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ డీఎంగా ఉన్న మోహన్‌బాబును కాకినాడలోని జడ్పీ కార్యాలయానికి బదిలీ చేశారు. నూతన డీఎంకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

సర్వేశాఖ ఏడీ..


జయరాజ్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా సర్వే భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులుగా జయరాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఆయనను జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన ఉద్యోగులతో సమావేశమయ్యారు. జిల్లాలో సర్వే కార్యక్రమాలపై చర్చించారు. సర్వే శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవల్ని అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

నాలుగు మండలాల్లో వర్షం

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం రాత్రి జిల్లాలోని నాలుగు మండలాల్లో వర్షం కురిసింది. శాంతిపురంలో 34.6 మి.మీటర్లు, వి.కోట 34, వెదురుకుప్పం 10.4, పాలసముద్రంలో 4.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏడో తేదీ నుంచి బస్‌పాస్‌లు

చిత్తూరు(కొంగారెడ్డిపల్లి), న్యూస్‌టుడే: ఆర్టీసీలో బస్సు పాస్ వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ కారణంగా శని, ఆదివారాల్లో పనిచేయదని, ఈ నెల ఏడో తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్‌లను కౌంటర్‌లలో ఇవ్వనున్నట్లు చిత్తూరు ఆర్టీసీ ఒకటో డిపో డీఎం రూపశ్రీ శుక్రవారం తెలిపారు. రెండ్రోజుల పాటు అంతరాయం కలగనుందని, విద్యార్థులు, ప్రజలు గుర్తించి, సహకరించాలని కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

రెండు నాటు తుపాకుల స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

యాదమరి, న్యూస్‌టుడే: లైసెన్సు లేకుండా ఉన్న రెండు నాటు తుపాకులు స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్సై ఈశ్వర్ తెలిపారు. శుక్రవారం కమ్మారాయనిమిట్ట క్రాస్ వద్ద కీనాటంపల్లి పంచాయతీ, షికారి కాలనీకి చెందిన సోనమ్, చిత్తూరు గ్రామీణ మండలం అనుపల్లికి చెందిన రమేష్.. వద్ద ఇవి ఉన్నాయని, వారిని అదుపులోకి తీసుకుని, నల్లమందు, ఇనుపగుళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

అమ్మవారి నామం.. పరమపద సోపానం


బాలాత్రిపురసుందరీదేవిగా బోయకొండ గంగమ్మ

బోయకొండ(చౌడేపల్లె), న్యూస్‌టుడే: శక్తిస్వరూపిణి బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం దసరా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముందుగా అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రాతఃకాలాభిషేకం చేశారు. అనంతరం ఆదిశక్తిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. పాలతో కూడిన ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించారు. యాగశాలలో ఉత్సవ మూర్తిని అలంకరించి ఉభయదారులు ఆధ్వర్యంలో వేదపండితులు హోమాలు నిర్వహించారు. కర్ణాటక ఎమ్మెల్సీ రామోజీగౌడ, మంజుల, బెంగళూరుకు చెందిన నరసింహమూర్తి, సరస్వతి, ములబాగలు రేణుక, నటరాజ మరికొందరు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈవో ఏకాంబరం ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నేడు బేటరాయస్వామికొండలో శ్రీవారి కల్యాణం


బేటరాయస్వామి కొండ వద్ద కల్యాణోత్సవానికి సిద్ధమైన వేదిక

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: పెరటాసి మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ఉర్లఓబనపల్లె సమీపంలో బేటరాయస్వామికొండ వద్ద 5న శనివారం తితిదే ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో అధికారుల బృందం ఏర్పాట్లు చేపట్టింది. కుప్పం అర్బన్ సీఐ జి.టి.నాయుడు కొండ ప్రాంతాన్ని పరిశీలించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సిబ్బందికి సూచనలు చేశారు. ఆలయం వద్ద సుమారు 30 వేల మంది భక్తులకుపైగా అన్నదానం చేపట్టనున్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి


జుబేద

చిత్తూరు జడ్పీ, న్యూస్‌టుడే: జడ్పీ డిప్యూటీ సీఈవోగా జుబేద స్థానిక జడ్పీ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె వైఎస్సార్ జిల్లా మైదుకూరు డీఎల్‌డీవోగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమె జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, సీఈవో రవికుమార్‌నాయుడిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం డిప్యూటీ సీఈవో ఛాంబరులో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందేలా తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆమెకు ఏవోలు, ఎంపీడీవోలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

లక్ష్మీదేవిగా మరగదాంబిక


లక్ష్మీదేవి అలంకారంలో మరగదాంబిక అమ్మవారు

కాణిపాకం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మరగదాంబిక సమేత శ్రీ మణికంఠేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు. అమ్మవారి మూలవిగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి, భక్తులు సామూహిక కుంకుమార్చన చేశారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈవో పి.గురుప్రసాద్, ఏఈవో రవీంద్రబాబు, ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్, భక్తులు పాల్గొన్నారు.

7న 'ప్రాజెక్టు చిత్తూరు' ప్రారంభోత్సవానికి శ్రీకారం

పాలసముద్రం, న్యూస్‌టుడే: ఆహార భద్రత, పునరుత్పాదక శక్తి, వ్యవసాయ-ఆరోగ్యకర మరియు మార్గదర్శక విద్యపై, మన వ్యవసాయ భూములు భవిష్యత్తు సుభిక్షానికి ప్రధాన ఇంధనంగా మారేలా ముందడుగు వేసేందుకు ఈ నెల 7న 'ప్రాజెక్టు చిత్తూరు' ప్రారంభోత్సవానికి శ్రీకారం చుట్టనున్నామని బెంగళూరు ఆత్రియా ఫౌండేషన్ ఛైర్మన్ సుందరరాజు తెలిపారు. ఆత్రియా యూనివర్సిటీ, ఆత్రియా పవర్ మరియు ఆత్రియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ భాగస్వామ్యంతో ప్రాజెక్టు చిత్తూరు కార్యక్రమాన్ని మండలంలోని తిరుమలరాజుపురం పంచాయతీ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మండల ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు బాలరాజు, గంగరాజు పాల్గొన్నారు.

ఎంబీయూలో అట్టహాసంగా మోహన్ మంత్ర


విద్యార్థులతో కలిసి ఛాలెంజ్ గేమ్ ఆడుతున్న మోహన్‌బాబు

చంద్రగిరి గ్రామీణ: స్థానిక ఎంబీయూ విశ్వవిద్యాలయంలో మోహన్ మంత్ర-2024ను ప్రో. ఛాన్సలర్ మంచు విష్ణు శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి తెలిపారు. మంచు విష్ణు మాట్లాడుతూ... ఎంబీయూ విద్యాసంస్థలు మోహన్ మంత్ర కార్యక్రమాన్ని 11వ సారి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికి తీయడమే మోహన్ మంత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక తదితర అంశాలపై 30కి పైగా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మంచు విష్ణు నృత్యం చేశారు. కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, ఎంబీయూ చీఫ్ గ్రోత్ వికాస్ సింగ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు కృషి చేయండి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతీదేవి

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో కుష్ఠు నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతీదేవి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం కుష్ఠు, క్షయ నివారణపై వైద్యాధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ కుష్ఠును ప్రారంభ దశలోనే గుర్తించాలని, అప్పుడే పూర్తిగా నయం చేయొచ్చని, నిర్లక్ష్యం చేస్తే బాధితులకు అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉందన్నారు. క్షయను సైతం మందులతో పూర్తిగా నయం చేయొచ్చని, మందులను రోగులు క్రమం తప్పక వాడాలన్నారు. జిల్లా క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్, జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్, వైద్యులు షర్మిల, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


నాగమ్మ (పాతచిత్రం)

సోమల, న్యూస్‌టుడే: మామిడితోటలో ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి ఓ వృద్ధురాలు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని పొదలకుంటపల్లెలో శుక్రవారం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన నాగమ్మ (65) సురేంద్రరెడ్డి అనే రైతుకు మామిడిచెట్లకు పాదులు తీసే పనికి వెళ్లింది. పనులు చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు పొలంలోని విద్యుత్తు తీగలు తగలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. బంధువులు మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, సర్పంచి జయరామ్, ఎంపీటీసీ సభ్యుడు నాగభూషణరెడ్డి కుటుంబసభ్యులకు పరామర్శించారు.

తండ్రిని హత్య చేసిన తనయుడు

పింఛన్ నగదు ఇవ్వలేదని ఘాతుకం

గుడుపల్లె, న్యూస్‌టుడే: మద్యానికి బానిసైన తనయుడు.. పింఛన్ నగదు ఇవ్వకపోవడంతో తండ్రిని హత్య చేసిన ఉదంతమిది. ఈ ఘటన గుడుపల్లె మండలం మిట్టూరులో శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వ్యవసాయ కూలీలైన వెంకటేశు(67), మంగమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు సోమశేఖర్ ఉన్నారు. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి. సోమశేఖర్ మద్యానికి బానిసగా మారడంతో భార్య బయమ్మ, కుమారుడు మాదేష్‌ను తీసుకుని పదేళ్ల కిందటే పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి సోమశేఖర్ తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. వెంకటేశుకు వృద్ధాప్య పింఛన్ వస్తుంది. గురువారం మంగమ్మ నూలుకుంటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో తండ్రి, కుమారుడు మద్యం తాగారు. పింఛన్ నగదు ఇవ్వాలని సోమశేఖర్ తండ్రిని అడిగాడు. అతను ఇవ్వకపోవడంతో ఆగ్రహంతో దుడ్డు కర్రతో అతనిపై దాడికి పాల్పడ్డాడు. తీవ్రగాయాలతో ఉన్న వెంకటేశును బంధువులు పీఈఎస్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. మృతుడి చిన్న కుమార్తె ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్ కేసు నమోదు చేశారు.

కళ్లముందే.. కన్నీళ్లు మిగిల్చి

తల్లడిల్లిన కుటుంబీకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యుల కళ్లముందే కడతేరిపోవడంతో ఆ కుటుంబీకులు కన్నీరుమున్నీరైన ఘటన శ్రీకాళహస్తిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కార్వేటినగరానికి చెందిన చంద్రశేఖర్ అలియాస్ రాజా(37) నగరిలో సెలూన్ నడుపుకుంటున్నాడు. ఆయన భార్య, పిల్లలు ఇక్కడి బి.పి.అగ్రహారం దర్గామిట్టలో కాపురం ఉంటున్నారు. అయితే దసరా ఉత్సవాల సందర్భంగా భార్య, పిల్లలు ఓంశక్తి మాల ధరించాలని నిర్ణయించారు. ఈ విషయమై శుక్రవారం సువర్ణముఖి నదిలోని స్నానఘట్టాల వద్దకు వెళ్లారు. అక్కడ స్నానం చేసేందుకు నిర్దేశిత ప్రాంతాన్ని దాటి లోనికి వెళ్లడం, ఈత వచ్చినప్పటికీ అక్కడ నుంచి బయటకు రాలేక పోవడంతో నీళ్లల్లో మునిగి చనిపోయాడు. కళ్లముందే ఈ ఘటన జరగడంతో భార్యా, పిల్లలు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మృతదేహానికి పంచనామా వద్దని కుటుంబీకులు విన్నవించడంతో వాళ్లకు అప్పగించామని, మృతదేహాన్ని వారి స్వస్థలమైన కార్వేటినగరానికి తీసుకెళ్లారంటూ పట్టణ సీఐ గోపి తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

నగరి, న్యూస్‌టుడే: మండలంలోని నాగరాజుకుప్పం రోడ్డు మార్గంలో గంజాయి విక్రయిస్తున్న ఒకరు, కొనుగోలు చేస్తున్న మరో ఇద్దరు తమిళనాడు వాసులు మొత్తం ముగ్గురిని శుక్రవారం అరెస్టు చేశామని సీఐ మహేశ్వర్ తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న నగరి మండలం ఓ.జి.కుప్పానికి చెందిన కె.హరిష్, కొనుగోలు చేస్తున్న తమిళనాడు అరక్కోణానికి చెందిన హుసేన్, నరేంద్రన్‌ను అరెస్టు చేసి, వారి నుంచి 1500 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. వీరి అరెస్టులో ప్రతిభ చూపిన సిబ్బందిని ఎస్పీ అభినందించారని పేర్కొన్నారు.

పుంగనూరులో ఇరువర్గాల వాగ్వాదం


అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ

పుంగనూరు, న్యూస్‌టుడే: అస్ఫియా అంజుమ్ మృతి కారకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలనే డిమాండుతో శుక్రవారం పట్టణంలో అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పురవీధుల గుండా సాగిన ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్‌కి రాగానే నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, అనుచరులు ఎదురుపడ్డారు. దీంతో వైకాపా, తెదేపా కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల జోక్యంతో వివాదం సమసిపోయింది. ఇందిరా కూడలిలో మరోసారి ఇరువర్గాలు తోపులాటకు పాల్పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో గొడవ నిలిచింది. ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	117
రిటైల్	139
లేయర్	110
బ్రాయిలర్స్	202
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	229
లేయర్ మాంసం	187

మొగిలి ఘాట్‌రోడ్డులో తప్పిన పెనుప్రమాదం

బంగారుపాళ్యం: పలమనేరు నుంచి చిత్తూరుకు మొక్కజొన్నలు తరలిస్తున్న లారీ ఘాట్‌రోడ్డు దిగుతున్న సమయంలో మొగిలి ఘాట్‌రోడ్డులో బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి వేగాన్ని పుంజుకొంది. లారీ డ్రైవరు చాకచక్యంగా లారీని రహదారి పక్కనున్న గుట్ట వైపు తిప్పడంతో దాన్ని ఢీకొని చక్రాలు విరిగి నిలిచింది. లేకుంటే ముందు వెళ్తున్న వాహనాలను ఢీకొని పెనుప్రమాదం జరిగేది. మరోవైపున దొరచెరువు మలుపు పైనుంచి ఘాట్‌రోడ్డులోని ఎస్ ఆకారంలో ఉన్న మలుపు వరకు వేగనిరోధకాలను జిల్లా రవాణాశాఖ అధికారి సునీల్‌కుమార్, సీఐ శ్రీనివాసులు ఏర్పాటు చేశారు. ఆరు కిలోమీటర్ల దూరం వరకు ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలను పంపామని చెప్పారు.

అప్పుల బాధతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

ఒకరి మృతి - ముగ్గురి పరిస్థితి విషమం


చికిత్స పొందుతున్న సునీత, దినేష్

జీడీనెల్లూరు: జీడీనెల్లూరుకు చెందిన నాగరాజులరెడ్డి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నాగరాజులరెడ్డితో పాటు అతడి భార్య జయంతి, కుమార్తె సునీత, కుమారుడు దినేష్ కలిసి ఇంటిలో పురుగుల మందు తాగారు. కొద్ది సమయానికి గుర్తించిన గ్రామస్థులు 108 వాహనంలో ఆ నలుగురిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే వారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. సీఐ లక్ష్మీనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

అధికారి కోసం పడిగాపులు..!

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో స్థిరాస్తి క్రయవిక్రయ లావాదేవీలతో చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శుక్రవారం కిటకిటలాడింది. అయితే అధికారులు అందుబాటులో లేకపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఆటంకం ఏర్పడింది. దీంతో కక్షిదారులు చాలాసేపు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ఈ కార్యాలయంలో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉన్నారు. ఉదయం కొద్దిసేపు ఉన్న అధికారులు.. తర్వాత పలు కారణాలతో బిజీ అయ్యారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ కుర్చీలు చాలాసేపు ఖాళీగానే కనిపించాయి. మధ్యాహ్నం నుంచి రిజిస్ట్రేషన్ పనుల్లో కాస్త వేగం కనిపించింది.

తపాలా సిబ్బందిపై వేధింపులు ఆపాలి

పాలసముద్రం: తపాలా సిబ్బందిపై వేధింపులు ఆపకపోతే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని మండల తపాలా సిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం వెంగళరాజుకుప్పం పోస్టాఫీసు వద్ద ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్‌ల పిలుపు మేరకు తపాలా సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. యూనియన్ సభ్యులు హరిబాబు, క్రిష్టయ్య, జీవ, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి

చిత్తూరు(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: ప్రజలందరూ కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక కొంగారెడ్డిపల్లిలోని సత్యనారాయణపురం అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని కాలనీలను ఆయన శుక్రవారం సందర్శించారు. అర్బన్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఇంటింటి సర్వే చేపట్టి జ్వరాల కేసులు గుర్తించి వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. సబ్‌యూనిట్ అధికారి రామకృష్ణ, సూపర్‌వైజర్ నారాయణ, రేవతి, తులసి, హేమ పాల్గొన్నారు.

'సుప్రీంకోర్టు తీర్పు స్వాగతిస్తున్నాం'

చిత్తూరు(జిల్లా పంచాయతీ): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సుప్రీంకోర్టు తీర్పు స్వాగతిస్తున్నామని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ పేర్కొన్నారు. తెదేపా జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పులో సీబీఐ అధికారులతో స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో ధర్మారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వైవీసుబ్బారెడ్డి, జవహర్‌రెడ్డి లాంటి కుట్రదారుల బండారం బయట పడుతుందన్నారు. శరవణ్‌కుమార్, ధరణీప్రకాష్, సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

సత్తా చాటి.. పతకాలు సాధించి

● నిత్య సాధనతో ముందుకు
● క్రీడల్లో రాణిస్తున్న యువత



న్యూస్‌టుడే, చిత్తూరు(క్రీడలు): అరకొర పరిస్థితుల్ని అధిగమించి.. క్రీడల్లో సత్తా చాటుతున్నారు పలువురు యువత.. ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపిస్తున్నారు.. గెలుపోటముల్ని లెక్కించక నిత్యం సాధన చేస్తూ ఆటల్లో ప్రావీణ్యం సాధించారు.. బరిలో దిగి.. గెలుపే లక్ష్యంగా పోరాట పటిమ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో తలపడి శెభాష్ అనిపించారు.. జాతీయ స్థాయిలో సత్తా చాటడమే తమ లక్ష్యమని అంటున్నారు చిత్తూరులో చదువుతున్న పలువురు విద్యార్థులు.

ఫుట్‌బాల్‌లో దిట్ట..



చంద్రశేఖర్.. ఫుట్‌బాల్ క్రీడలో దిట్ట. ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. తల్లిదండ్రులు దినసరి కూలీలు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన చంద్ర.. చదువు, క్రీడలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నాడు. పాఠశాల, ఇంటర్ కళాశాల స్థాయిలో స్కూల్ గేమ్స్‌లో రెండు రజతాలు, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు. డిగ్రీలో చేరిన తర్వాత ప్రతి రోజూ సాధన చేస్తూ మరింత ప్రావీణ్యం సాధించాడు. విశ్వవిద్యాలయాల స్థాయి పోటీల్లో తలపడేందుకు సన్నద్ధమవుతున్నాడు. జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం కోసం ప్రయత్నాల్ని కొనసాగిస్తానని చెప్పాడు చంద్రశేఖర్.

గోల్ కొట్టి.. పతకం పట్టి..



మహేంద్ర.. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. క్రీడలంటే ఈ యువకుడికి ఎంతో ఆసక్తి. పదో తరగతి నుంచి హాకీలో సాధన చేస్తున్నాడు. స్కూల్ గేమ్స్, అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించాడు. శిక్షకుల ప్రోత్సాహంతో ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం సాధన చేస్తూ ఆటలో పరిణితి సాధించాడు. ఇటీవల బెంగళూరులో జరిగిన అంతర విశ్వవిద్యాలయాల హాకీ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించాడు. జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడమే తన లక్ష్యమంటున్నాడు మహేంద్ర.

శెభాష్ కుమార్..



కుమార్.. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చాడు. పాఠశాల స్థాయి నుంచి ఫుట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నాడు. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ముందుకు సాగుతున్నాడు. శిక్షకుల ప్రోత్సాహంతో స్కూల్ గేమ్స్, ఇంటర్ కాలేజీల్లో జిల్లా స్థాయి పోటీల్లో ఒక రజతం, రెండు కాంస్యాలు సునాయాసంగా గెలుపొందాడు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం కోసం నిత్య సాధనతో ప్రయత్నిస్తున్నట్లు చెప్పాడు కుమార్.



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

'అస్సియాను హత్య చేసిన వ్యక్తుల్ని ఉరితీయాలి'

చిత్తూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: అభంశుభం తెలియని అస్సియా అంజుమ్‌ను హత్య చేసిన వారిని ఉరితీయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ విగ్రహం ఎదుట సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులు, మహిళలు, వయోవృద్ధులపై జరిగే దాడులు, అఘాయిత్యాలపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలన్నారు. అస్సియా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు రమాదేవి, చంద్ర, రఘు, బాలసుబ్రహ్మణ్యం, విజయగౌరి, ఆర్ముగం పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఐరాల: నూతన ఎంపీడీవో ధనలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వెదురుకుప్పం: నూతన ఎంపీడీవోగా అమర్నాథ్ బాధ్యతలు చేపట్టారు. జిల్లా తెదేపా మాజీ కార్యదర్శి మోహనమురళి, నియోజకవర్గ యువనేత గంగయ్య సత్కరించారు. పూతలపట్టు: ఎంపీడీవోగా వీఆర్ నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. కార్వేటినగరం: నూతన ఎంపీడీవో చంద్రమౌళి బాధ్యతలు స్వీకరించారు. తెదేపా మండల అధ్యక్ష కార్యదర్శులు చెంగల్రాయులు యాదవ్, రాజేంద్రరెడ్డి, నాయకులు రవియాదవ్, దేవా, పరంధామ, మునికృష్ణ, రుక్కుబాబు ఆయన్ను సత్కరించారు. ● ఎక్సైజ్ ఎస్సైగా శ్రావణ్‌తేజ్ బాధ్యతలు స్వీకరించారు. ● విద్యుత్తుశాఖ ఏఈగా రామ్మూర్తి బాధ్యతలు స్వీకరించారు.



సీఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే గురజాల, ఎమ్మెల్యే థామస్, ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

సీఎంకు ఎమ్మెల్యేల ఆత్మీయ స్వాగతం

తిరుమల పర్యటన కోసం శుక్రవారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న సీఎం చంద్రబాబుకు.. చిత్తూరు, నగరి, జీడీనెల్లూరు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్ , గాలి భానుప్రకాస్, డాక్టర్ థామస్ ఘన స్వాగతం పలికారు. పాలసముద్రం: సీఎం చంద్రబాబును.. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిట్టిబాబునాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు.

- న్యూస్‌టుడే, చిత్తూరు(జిల్లా పంచాయతీ), పెనుమూరు, పుత్తూరు



కలెక్టరేట్: కట్టమంచి షిర్డీ సాయిబాబా మందిరంలో గాయత్రిదేవి అలంకరణ



చిత్తూరు : కోదండరామ స్వామి దేవస్థానంలో..



ఐరాల: బాలా త్రిపుర సుందరీ దేవిగా పాలేటి గంగమ్మ..



పుత్తూరు: శ్రీకన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో కన్యకాశివ పూజ అలంకరణ

కాశీ విశాలాక్షి.. రక్షమాం

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: దేవీ నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా చిత్తూరు నగరంలోని ఆలయాల్లో అమ్మవారు శుక్రవారం వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బంగారుపాళ్యం: వజ్రాలపురం బోయకొండ గంగమ్మ గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అడవిపల్లి రిజర్వాయర్ నీటిని చిత్తూరుకు తీసుకురండి

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: చిత్తూరు నగర దాహార్తి తీర్చేందుకు అడవిపల్లి రిజర్వాయర్ నీటిని తీసుకు రావాలని, పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బీవీరెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. అమృత్ పథకం అనుసంధానంగా ఏషియన్ మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు(ఏఐఐబీ) అడవిపల్లి రిజర్వాయర్‌కు ఇచ్చిన నిధులతో పైపు లైన్ పనులు పూర్తిచేయాలన్నారు. పైపులైను పనులు ప్రారంభించాలంటే హైవే అధికారుల అనుమతులు కావాలని అధికారులు చెప్పగా.. అందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ రిజర్వాయర్ ద్వారా 0.785 టీఎంసీల నీటిని చిత్తూరు నగరానికి కేటాయించాలని జలవనరుల శాఖ మంత్రిని కోరామని, దామలచెరువు వద్ద 37 ఎం.ఎల్.డి వాటర్ ట్రీట్మెంట్ సైట్ సమస్య పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కమిషనర్ నరసింహప్రసాద్, తిరుపతి, చిత్తూరు ప్రజారోగ్య విభాగం ఈఈలు సుబ్బరాయుడు, పుష్పగిరినాయక్, ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి, హైవే ఈఈ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణం ప్రారంభం

గుడిపాల, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చొరవతో రామభద్రాపురం నూతన గ్రామ సచివాలయానికి నిధులు మంజూరయ్యాయి. దీని నిర్మాణానికి శుక్రవారం మండల తెదేపా కన్వీనర్ సుబ్రహ్మణ్యం నాయుడు పూజలు చేశారు. ఈ భవన దుస్థితిపై సర్పంచి గోళ్ల హరిణి, సచివాలయ సిబ్బంది ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి నిధులు మంజూరు చేయించారు. ఈ భవనం పూర్తయితే స్థానికుల సమస్య తీరనుంది. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రినాయుడు, మాజీ సర్పంచి పయణి, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఇసుక ఉచితంగా సరఫరా చేయాలి

పుత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా సరఫరా చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేశ్ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా భవన నిర్మాణ రంగ కార్మికులతో కలిసి నిరసన తెలియజేశారు. శివకుమార్, మోసెస్, భవన నిర్మాణ రంగ కార్మికులు శేఖర్, శరవణ, నవీన్‌కుమార్, చిరంజీవి పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల ప్రజావేదిక.. నగరి: మండలంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీల ప్రజావేదిక శుక్రవారం నిర్వహించారు. వాటర్‌షెడ్ ఏపీడీ ఉమావాణి హాజరై పరిశీలించారు. తెరణిలో ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేసిన మహిళకు రూ.2564 బినామీ మస్టర్ వేసినట్లు గుర్తించడంతో సస్పెండ్ చేసినట్లు వివరించారు. కృష్ణారామాపురంలో వంద రోజులు పనులు పూర్తికావడంతో ఒకరి పేరుతో మస్టర్ వేసి రూ.68,504 చెల్లించినట్లు తెలిసి విచారణకు ఆదేశించామన్నారు. మరో 10 పంచాయితీలకు రూ. 14600 అపరాధం విధించినట్లు వివరించారు.

ఏడు నుంచి వేపంజేరి ఆలయ బ్రహ్మోత్సవాలు.. జీడీనెల్లూరు: వేపంజేరి శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల ఏడో తేదీ నుంచి 12వరకు నిర్వహించనున్నట్లు ధర్మకర్త వాసు, మేనేజరు వెంకటేశులరెడ్డి శుక్రవారం తెలిపారు.

శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

పుత్తూరు, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ, బీసీ గ్రామాల్లో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలోనైనా శ్మశానవాటికల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కొన్ని గ్రామాల్లో ఉన్నా దారి సౌకర్యం లేదన్నారు. గాలేరు-నగరి ప్రాజెక్టు పనుల్లో భాగంగా వేణుగోపాల్‌సాగర్ నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేయాలన్నారు. తద్వారా నాలుగువేల ఎకరాలకు సాగు నీరు. పుత్తూరుకు తాగునీటి అందుతుందన్నారు. టిడ్కో ఇళ్లు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, జానపద కళాకారుల జిల్లా కార్యదర్శి ముకుంద, గోపీ, గణేష్, వెంకటేష్, భాస్కర్ పాల్గొన్నారు.



అమరావతిలో బాధ్యతలు చేపట్టిన గోవింద్ సత్యనారాయణ, ఊకా విజయకుమార్, చందన స్రవంతి

బాధ్యతల స్వీకరణ

తిరుపతి(నగరం): రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్లుగా తిరుపతికి చెందిన ఊకా విజయకుమార్, సత్యవేడుకు చెందిన చందన స్రవంతి శుక్రవారం అమరావతిలో ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఛైర్మన్ గోవింద్ సత్యనారాయణతో పాటు బాధ్యతలు స్వీకరించారు. ఊకా విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

వినాయకుడి సేవలో ప్రముఖులు

కాణిపాకం: శ్రీ వరసిద్ధి వినాయకస్వామిని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా, కర్నూలు జిల్లా నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య వేర్వేరుగా శుక్రవారం దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు వారికి దర్శనం కల్పించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ సురేష్ ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

సమస్య: నల్లరాళ్లపల్లె పక్కా ఇళ్ల కాలనీలోని ఓ వీధిలోనే చెత్తాచెదారం, రాళ్లురప్పలు వేయడంతో విషపురుగులు చేరి తరచూ కాలనీ వాసులను ప్రమాదాలకు గురిచేస్తున్నాయి.

- నాగమ్మ, స్థానికురాలు

సమాధానం: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులచే వీధిలో నిల్వఉన్న చెత్తాచెదారం తొలగింపజేసి పారిశుద్ధ్యం మెరుగుచేయిస్తాం. - సుబ్రహ్మణ్యయాదవ్, సర్పంచి, జీడీనెల్లూరు

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

సమస్య: స్థానిక కట్టమంచిలో నివాసాల మధ్య మురుగు నీటి కాలువల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయినట్లు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

సమాధానం: కాలువలో పూడిక తొలగింపజేస్తాం.

- అనిల్ కుమార్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

రోగులకు భోజన వసతి.. బంగారుపాళ్యం: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందుతున్న రోగులకు శుక్రవారం నుంచి మూడుపూటల ఉచిత భోజనం సదుపాయాన్ని శుక్రవారం నుంచి ప్రారంభించినట్లు వైద్యాధికారిణి శీరిష తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన నేపథ్యంలో గుత్తేదారు ద్వారా నిత్యం భోజనం అందజేస్తామన్నారు.

పొరుగు రాష్ట్రం వెళ్లి పింఛను పంపిణీ .. చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చెర్లోపల్లెకు చెందిన తాపీమేస్త్రీ, వయోవృద్ధుడు ఆర్ముగానికి ఇటీవల కాలు విరిగింది. అతడు తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాలోని అడుమర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శివరాజన్ తన సొంత ఖర్చులతో అతడి వద్దకు వెళ్లి పరామర్శించి పంపిణీ చేశారు. టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ రమేష్‌నాయుడు, గ్రామస్థులు.. పంచాయతీ కార్యదర్శిని అభినందించారు.

విద్యుత్తు నియంత్రిక చోరీపై ఫిర్యాదు.. వెదురుకుప్పం: పాతగుంట పంచాయతీలో యువరైతు నాగరాజుకు చెందిన వ్యవసాయం బావి వద్ద ఏర్పాటు చేసిన నియంత్రిక చోరీకి గురైనట్లు బాధిత రైతు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

స్వశక్తితో ముందుకు

● అందివచ్చిన పొదుపు రుణాలు
● వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలు

న్యూస్‌టుడే, గుడిపాల

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు పొంది ప్రగతి దిశగా పయనిస్తున్నారు.. మండలంలోని 883 మహిళా సంఘాల్లో.. 8,830 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.. వీరు రూ.1.5 కోట్లు బ్యాంకు రుణాలు తీసుకుని వివిధ వ్యాపారాలు చేస్తూ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నారు.. సమస్యల సుడిగుండాల నుంచి గట్టెక్కి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

వడ్డీల బాధ తప్పింది..



గతంలో వ్యాపారం కోసం ప్రైవేటు వ్యక్తుల దగ్గర అధిక వడ్డీలకు నగదు తెచ్చి వ్యాపారం చేసేదాన్ని. సంపాదన వడ్డీలకే సరిపోయేది. స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నందున బ్యాంకు లింకేజీ ద్వారా తక్కువ వడ్డీకి రూ.1.5 లక్షల రుణం తీసుకున్నా. దీంతో తమకున్న పొలంలో కూరగాయలు సాగు చేసి గ్రామాల్లో, వారపు సంతల్లో విక్రయిస్తూ రోజుకు రూ.వెయ్యి వరకూ సంపాదిస్తూ కుటుంబ అభివృద్ధికి సహకరిస్తున్నా.

- వళ్లియమ్మ, సాయిబాబా మహిళా మండలి సభ్యురాలు, అడవిచేను గ్రామం

పిల్లల్ని ఉన్నత చదువులు చదివిస్తున్నా..



పొదుపు చేసుకున్న కొంత నగదుతో బాటు మహిళా సంఘం ద్వారా రూ.2లక్షలు బ్యాంకు లింకేజీ రుణం తీసుకున్నా. మండలంలోని చీలాపల్లె క్రాస్‌లో ప్రొవిజనల్ షాపు పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నా. ఈ దుకాణం ద్వారా రోజుకు రూ.2వేల వరకూ సంపాదిస్తూ భర్తకు చేదోడుగా ఉంటున్నా. కూతురు, కుమారుడ్ని ఉన్నత చదువులు చదివిస్తున్నా. -కె.విజయలక్ష్మి, ప్రగతి మహిళా మండలి సభ్యురాలు, శ్రీరంగంపల్లె

చక్కటి ఇల్లు కట్టుకున్నాం..



గతంలో పక్కా ఇళ్లు లేవు. భర్త సంపాదన ఇంటి ఖర్చులకే సరిపోయేది. పూరింట్లో ఉండే వాళ్లం. ఏదైనా వ్యాపారం చేసి కొంత సంపాదించాలనుకున్నా. తమ స్వయం సహాయ సంఘం ద్వారా రూ. 2లక్షలు రుణం తీసుకున్నా. తమిళనాడులోని వేలూరు, చెన్నైకి వెళ్లి, ఎండిన చేపలు తెచ్చి వారపు సంతల్లో విక్రయిస్తూ రోజుకు రూ.వెయ్యి వరకు సంపాదిస్తూ కుటుంబ ఖర్చులు పోనూ పొదుపు చేసిన మొత్తంతో చక్కటి ఇల్లు నిర్మించుకున్నాం.

- సత్య, దేవి మహిళా సంఘం సభ్యురాలు, అడవిచేను

రోజుకు రూ.వెయ్యి సంపాదిస్తున్నా..



తమకు కొద్దిగా పొలం ఉంది. ఏ పంటలు వేసినా గిట్టుబాటు కావడం లేదు. దీంతో తమ మహిళా సంఘం ద్వారా రూ.1.5 లక్షలు బ్యాంకు లింకేజీ రుణం తీసుకున్నా. ఈ నగదుతో పొలంలో పెట్టుబడి పెట్టి ఆకుకూరలు, బెండ, కాకర సాగు చేసి ఆపై వాటిని సమీప గ్రామాల్లో, పట్టణాల్లో విక్రయించి రోజుకు రూ.వెయ్యి వరకు సంపాదిస్తూ కుటుంబ అభివృద్ధికి కృషి చేస్తున్నా. - రుక్మిణి, శ్రీవల్లి మహిళామండలి సభ్యురాలు, పాపసముద్రం



మాట్లాడుతున్న అశోకరాజు

'సనాతన ధర్మంపై పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు అక్షర సత్యం'

పుత్తూరు, నారాయణవనం: తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో నెలకొన్న వివాదం నేపథ్యంలో సనాతన ధర్మంపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు అక్షర సత్యమని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలల ఛైర్మన్ కొండూరు అశోకరాజు పేర్కొన్నారు. సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సనాతన ధర్మంపై ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టి, తిరుపతిలో వారాహి సభ ద్వారా సనాతన ధర్మం గురంచి చక్కగా చెప్పారన్నారు. ఆయనపై విమర్శలు చేయడం తగదన్నారు. యువత సనాతన ధర్మం గురించి తెలుసుకోవాలన్నారు. అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ దేశ వర్సిటీల్లో భగవద్గీతను పాఠ్యాంశంగా బోధిస్తున్నారని, మన దేశంలోనూ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దనరాజు, రమేష్, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానానికి భూమి కేటాయింపు

బంగారుపాళ్యం: కరిపిరెడ్డిపల్లెలో తగాదాలలో ఉన్న శ్మశాన భూమిని తహసీల్దారు శుక్రవారం పరిశీలించారు. గతంలో 15సెంట్లుగా ఉన్న శ్మశాన భూమిని 30సెంట్లుగా నిర్ధరించారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

వృద్ధుల సంరక్షణ వారసులదే

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సమాజంలో వృద్ధుల సంరక్షణ బాధ్యతలు వారసులదేనని తీర్థం పీహెచ్‌సీ హెచ్‌ఈ కాంతమ్మ అన్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా దాసార్లపల్లెలో శుక్రవారం ప్రజలకు ఆమె అవగాహన కల్పించారు. తేలికపాటి శారీరక శ్రమ, నడక, వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ నవీన, ఏఎన్‌ఎం కవిత పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

పలమనేరు: ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 వేల విరాళాన్ని దాతలు అందించారు. శుక్రవారం పట్టణానికి చెందిన మహేశ్వర ధ్యానయోగ అకాడమీ ఆధ్వర్యంలో చెక్కును పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఇచ్చారు. రంగనాథ్, వెంకటరమణ, బాలాజీ, వెంకటరమణగౌడు, రవి పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రాధాన్యం

పలమనేరు: దోమల నివారణకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని పీహెచ్‌సీ సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని కిట్టన్నమిషన్ రోడ్డులో ఇంటింటికి వెళ్లి దోమలపై అవగాహన కల్పించారు. నిలువ నీటి పారబోయాలన్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు దోమ కాటుకు గురికాకుండా ఉండాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

న్యూస్‌టుడే, సోమల

సమస్య: అడుసుపల్లె దిగువ వీధి మురుగుకాలువలో పిచ్చిమొక్కలు పెరిగి దుర్గంధం ఏర్పడింది. దుర్వాసన, దోమలబెడద భరించలేకపోతున్నాం.

– స్థానికులు

సమాధానం: వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీదేవి, ఈవోపీఆర్డీ, సోమల

న్యూస్‌టుడే, పలమనేరు

సమస్య: పట్టణంలోని టీఎస్ అగ్రహారంలో మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నాం. పూడిక తీయించాలి.

– మురళి, పలమనేరు

సమాధానం: వెంటనే పరిశీలించి కాలువలు శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఎన్వీరమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్

మెరుగైన పారిశుద్ధ్యం

స్పందనకు వందనం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని బత్తలాపురంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి బసవరాజ, సర్పంచి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు మురుగు కాలువల్లో వ్యర్థాలు, రోడ్లపై వేసిన దిబ్బలు తొలగించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ నెల 4న మేమున్నాం.. మీకు తోడుగాలో వచ్చిన వార్తకు స్పందించిన సిబ్బంది గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు రజక కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి రజక కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తిరుపతి, దేవేంద్ర థియేటర్ రోడ్డు, రైల్వే కాలనీలోని ఈనాడు ఆఫీసు వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురు చూస్తున్న వారు వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (5 అక్టోబర్ 2024, శనివారం), రేపు (6 అక్టోబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు **91547 72006 & 80080 02165** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫొటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

గృహ ప్రవేశాలు సరే.. వసతులేవీ..?

☛ టిడ్కో సముదాయాల్లో ప్రజల అవస్థలు

☛ రహదారులు అధ్వానం.. నీటి సరఫరా అంతంతే



పుంగనూరు గృహ సముదాయాల మధ్య నెలకొన్న దుస్థితి



అసంపూర్తిగా ఓహెచ్‌ఎస్‌ఆర్ నిర్మాణం

పుంగనూరు, న్యూస్‌టుడే: పట్టణ నిరుపేదలకు గృహవసతి కల్పించడానికి నాటి తెదేపా ప్రభుత్వం 24 ఎకరాల్లో పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టింది. వాటిని వైకాపా ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలకు ముందు లబ్ధిదారులకు కేటాయించింది. కానీ అవసరమైన వసతులు పూర్తిస్థాయిలో కల్పించకపోవడంతో అక్కడ నివసించే వారి పరిస్థితి దారుణం. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వసతులు మెరుగుపడతాయని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

పేద, మధ్యతరగతి చిరకాల స్వప్నం

ఆ కలను సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2017-18లో 2,160 ఇళ్లకు భూమి పూజ చేశారు. ఎన్నికల ముందుగా 1,536 మంది లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందించారు. కానీ నేటికీ 200 కుటుంబాలే అక్కడ ఉంటున్నాయి. వసతులు లేకపోవడమే ఇందుకు కారణం. రూ.14కోట్లతో రోడ్లు, కాలువలు, విద్యుత్తు సరఫరా కల్పించారు. ఇళ్లకు సరఫరా చేసే నీరు తాగేందుకు పనికి రావడం లేదు. దీంతో ప్రైవేట్ శుద్ధి కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ప్రస్తుతం జీహెచ్‌ఎస్‌ఆర్‌తో నీటి సరఫరా చేస్తున్నా ఆ నీళ్లు తాగడానికి ఉపయోగపడడం లేదు. ఓహెచ్‌ఎస్‌ఆర్ పనులు అర్ధాంతరంగా ఆపేశారు. పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

గణాంకాల్లో

కేటాయించిన స్థలం	24 ఎకరాలు
పూర్తయిన ఇళ్లు	1,536
నివసిస్తున్న వారు	200 మంది
రద్దయినవి	624

అంతంత మాత్రమే వసతులు

రోడ్లు, కాలువలు నిర్మించారు.. విద్యుత్తు వసతి కల్పించారు. కానీ కాలువల శుభ్రత, శుద్ధ జలం అందడంలేదు. భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు, విషపురుగుల బెడద ఎక్కువగా ఉండడం, రవాణా వసతి లేకపోవడంతో లబ్ధిదారులు ఆ ఇళ్లలో చేరడానికి ముందుకు రావడం లేదు. నీటి తొట్టెలు, సెప్టిక్ ట్యాంకులు దుస్థితికి చేరుకున్నాయి. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు వర్షపు నీరు చేరి దోమలకు నిలయంగా మారింది. అంగన్‌వాడీ సెంటరు, పాఠశాల, దుకాణాల సముదాయం, పార్క్ ఏర్పాటు చేయలేదు.

భద్రత కరవు

లబ్ధిదారుల్లో కొందరు సొంత డబ్బులు వెచ్చించి కొన్ని సౌకర్యాలు కల్పించుకుని ఇళ్లలో చేరారు. అంతస్తులు కావడంతో అక్కడక్కడ ఇళ్లల్లో చేరడంతో అక్కడ నివసించే వారికి భద్రత కరువైంది. అపార్ట్‌మెంట్లలో ఇళ్లకు ఇళ్లకు మధ్య దూరం ఉండటం మరో ఆందోళన. రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

క్షేత్రస్థాయిలో పరిస్థితులపై నివేదిక

టిడ్కో ఇళ్లలో గల మౌలిక వసతులపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం. అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తా. అసంపూర్తి పనులపై సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటాం.

– మధుసూదనరెడ్డి, పురపాలక కమిషనరు, పుంగనూరు

రైతుల అభ్యున్నతికే కూటమి ప్రాధాన్యం



గోకులం షెడ్ల అనుమతి పత్రాలు అందిస్తున్న కంచర్ల, పీఎస్ మునిరత్నం

రామకుప్పం, న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గోకుల షెడ్ల నిర్మాణ అనుమతి పత్రాలు లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ఉపాధి హామీ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలు, పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం రాయితీతో షెడ్ల నిర్మాణానికి రైతులకు తోడ్పాటును అందించనున్నట్లు తెలిపారు. 126 గోకులాలు మంజూరైనట్లు తెలిపారు. ఏపీవో రవికుమార్, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, మునస్వామి, నరసింహులు, పత్రనారాయణ, చలపతి పాల్గొన్నారు.



రైతుకు కిట్ పంపిణీ చేస్తున్న డీడీ

పోషకాల లోపం పరీక్షలతోనే గుర్తించవచ్చు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: భూమి పోషకాల లోపాలను భూసార పరీక్షలతోనే గుర్తించగలమని ఉద్యానవనశాఖ డీడీ మధుసూదనరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి రైతు అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. లవణాల శాతం, సారవంతం తీరు పరీక్షలతో తెలుసుకోవచ్చన్నారు. రైతులు వీటిపై అవగాహన కల్గినప్పుడు ఎప్పటికప్పుడు తమ భూమిలోని లోపాలను గుర్తించి సారవంతం చేసుకోవడానికి అవకాశముంటుందని వివరించారు. పరీక్షలు చేసే కిట్స్‌ను ఉచితంగా ప్రభుత్వం అందించిందని తెలిపారు. ఉద్యానాధికారులు సంతోషికుమారి, వరప్రసాద్ పాల్గొన్నారు.

ద్రవిడలో విశ్వవిద్యాలయాల సమావేశం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ద్రవిడ విశ్వవిద్యాలయం వేదికగా డిసెంబరులో రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సమావేశం జరుగుతుందని ఆ సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. వర్సిటీలో శుక్రవారం బోధనేతర ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహణకు సంబంధించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దిక్సూచిగా పురపాలిక



మాట్లాడుతున్న రాజ్‌కుమార్, పాల్గొన్న పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: అభివృద్ధిలో కుప్పాన్ని రాష్ట్రానికి దిక్సూచిగా మార్చడమే సీఎం నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని.. అందుకనుగుణంగా కృషి చేస్తున్నామని తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని పురపాలిక 22వ వార్డులో పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. కౌన్సిలర్లు సురేష్, దాము, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి వీజీ ప్రతాప్‌కుమార్, నాయకులు జాకీర్, వెంకటేష్ జనసేన నాయకుడు నరేష్ పాల్గొన్నారు.

బాలాత్రిపురసుందరీ దేవిగా శ్రీసల్లాపురమ్మ



బైరెడ్డిపల్లెలో..



పుంగనూరులో..



రామకుప్పంలో..



పుంగనూరు: కూర్మావతారంలో వేంకటేశ్వరుడు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: స్థానిక ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీసల్లాపురమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో శుక్రవారం బాలాత్రిపురసుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అర్చకులు అమ్మవారికి అభిషేకం, బాలత్రిపురసుందరిగా అలకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు.

కుప్పం పట్టణం: శరన్నవరాత్రుల్లో భాగంగా హిందూ ధర్మపరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కుప్పం ప్యాలెస్ కూడలి వద్ద దుర్గాదేవి అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేశారు. కుప్పం పట్టణం రామచంద్రారోడ్డులో శ్రీవిశ్వదుర్గాపరమేశ్వరి భక్త మండలి ఆధ్వర్యంలో దుర్గాదేవి ప్రతిమను ఏర్పాటు చేశారు. కుప్పం గ్రామదేవత శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ దేవాలయంలో శుక్రవారం గాయత్రి దేవి అవతారంలో శ్రీప్రసన్న ముత్తుమారెమ్మను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రామచంద్రారోడ్డులోని దుర్గాదేవికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ దంపతులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు.

పుంగనూరు: నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణ, గ్రామీణ మండలాల్లోని ఆలయాల్లో రద్దీ నెలకుంది. రెండో రోజైన శుక్రవారం కల్యాణ వేంకటరమణస్వామి ఆలయంలో దుర్గాదేవి ప్రతిమ నెలకొల్పారు. కూర్మావతారంలో, విరూపాక్షి మారెమ్మదేవత, పార్వతీ దేవి, చౌడేశ్వరిదేవిలను ప్రత్యేకంగా అలంకరించారు.

రామకుప్పం: మండలంలోని ఆనిగానూరులో కన్యకాపరమేశ్వరి అమ్మవారు శుక్రవారం కుంకుమ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

అక్రమ పట్టాలుంటే గుర్తించి చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

పలమనేరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో పంపిణీ చేసిన వాటిలో అక్రమ పట్టాలుంటే గుర్తించి చర్యలు తీసుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన తహసీల్దార్లతో సమావేశమయ్యారు. దొంగ పట్టాలపై ఆరోపణలు ఉన్నాయని వాటిని గుర్తించాలన్నారు. నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడానికి బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి మండలాల్లో భూములు గుర్తించాలన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సూచించారు. తహసీల్దార్లు ఇన్బనాథన్, మాధవరాజు, శివకుమార్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: యుగంధర్‌గౌడు భౌతికకాయం వద్ద శుక్రవారం అమరనాథరెడ్డి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు పాల్గొన్నారు.



మండల కేంద్రం సదుం-జాండ్రపేట ప్రధాన రహదారి మార్గంలోని వంతెనపై కొంత కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. దీపాలు వేయకపోవడం అంధకారం అలుముకుంది. రాత్రి సమయంలో రోడ్లపైకి రావాలంటేనే వృద్ధులు, పిల్లలు జంకుతున్నారు. సదుం-కలికిరి రహదారి మార్గంలోని వంతెనపై వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించిన అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. ఇందిరమ్మ కాలనీ, బట్టువారిపల్లె రహదారి మార్గంలో పలు చోట్ల వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సదుం



మొరాయించి.. సతాయించి..!

కుప్పం- పలమనేరు మార్గంలో ఆర్టీసీ ఆర్డినరీ సర్వీసుల బస్సులు తరచూ మొరాయిస్తున్నాయి. కాలం చెల్లిన బస్సుల్ని నడుపుతున్నందున మార్గమధ్యంలో మరమ్మతులకు గురవుతున్నాయి. శుక్రవారం పలమనేరు డిపోకు చెందిన బస్సు శాంతిపురం మండలం పోడూరు వద్ద ఆగిపోయింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి బస్సుల కండీషన్‌ను మెరుగుపరచాల్సిందిగా వారు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, శాంతిపురం

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న చల్లా రామచంద్రారెడ్డి దంపతులు

బోయకొండ (చౌడేపల్లె), న్యూస్‌టుడే: బోయకొండ గంగమ్మకు తెదేపా పుంగనూరు నియోజకవర్గ బాధ్యులు చల్లా రామచంద్రారెడ్డి దంపతులు శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించారు. నియోజకవర్గంలో ప్రజలకు శాంతి, సంక్షేమం కలగాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం వృద్ధి చెందాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. తెదేపా మండల అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, రామచంద్ర, లక్ష్మీపతి రాజు, సుబ్రమణ్యం, శివకుమార్ పాల్గొన్నారు.

హంస వాహనంపై శ్రీరామచంద్రస్వామి విహారం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: తీర్థంలో వెలసిన శ్రీరామచంద్రస్వామి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం హంస వాహనంపై స్వామివారు విహరించారు. ఆలయంలో ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకం, మంటపోత్సవం, ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి హంస వాహనంపై కొలువుదీర్చారు. స్వామివారిని మాడవీధుల్లో ఊరేగించారు.

సంక్షేమ పథకాల్లో దళితులకు ప్రాధాన్యం

శాంతిపురం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా దళిత నేతలు కోరారు. మండల సచివాలయంలో శుక్రవారం జరిగిన ఎస్సీ, ఎస్టీ అస్పృశ్యత నివారణ సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ.. మినీ గోకులాలు, వెలుగు రుణసాయంలో అర్హులకు లబ్ధి చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. స్మశాన స్థలాలు సర్వే చేసి రక్షణ గోడలు నిర్మించాలని విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతామని ఎంపీడీఓ కుమార్, తహసీల్దార్ శివయ్య తెలిపారు.

వెలుగు సంఘాల బలోపేతానికి కృషి

శాంతిపురం, న్యూస్‌టుడే: వెలుగు స్వయం సహాయక మహిళా సంఘాల బలోపేతానికి అధికారులు, సిబ్బంది సమష్టి కృషి సాగించాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల తెదేపా అధ్యక్షుడు విశ్వనాథనాయుడు కోరారు. శుక్రవారం మండల సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. ప్రభుత్వ తోడ్పాటు సద్వినియోగంతో ఆర్థిక స్వావలంబన సాధించే విధంగా చైతన్యం తీసుకురావాలని తెలిపారు. అనసూయ, చంద్రకళ, రమేష్ పాల్గొన్నారు.

చిన్నారిని హతమార్చిన నిందితులపై కఠిన చర్యలకు డిమాండ్

ఈనాడు, అమరావతి: పుంగనూరులో చిన్నారి అనుమానాస్పద మృతి తనను కలచివేసిందని, ఈ మృతికి బాధ్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుని, బాలిక కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని బీసీ వైపీ అధ్యక్షుడు బి.రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. మహిళలు, చిన్నారులపై నేరాలను అదుపు చేసేందుకు వ్యవస్థలను బలోపేతం చేయాలని శుక్రవారం ఓ ప్రకటనలో ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అందులో.. 'కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఉమ్మడి కర్నూలు జిల్లా ముచ్చుమర్రిలో ఇదే తరహా ఘటన జరిగింది. ఈ నాలుగు నెలల్లో చీరాల, అనకాపల్లి, నంద్యాల, విజయనగరం, ఏలూరు లాంటి ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులపై నేరాలు, అఘాయిత్యాలు చోటుచేసుకున్నాయి. ఇలాంటి నేరాలపై సీఎం స్థాయిలో సమీక్షించాలి. పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలి. సీసీ కెమెరాలతో పోలీసు నిఘా పెట్టాలి' అని సూచించారు.

అధికారం మనదే.. కట్టేయ్

☛ పురపాలిక స్థలాలపై వైకాపా నాయకుల పెత్తనం

☛ రూ.లక్షలు వెచ్చించి భవనాల నిర్మాణం

☛ అధికార మార్పిడితో ఒప్పందానికి ముప్పుతిప్పలు



బస్టాండు సమీపంలోని గదులు



బాలికోన్నత పాఠశాల వద్ద గదులు

పలమనేరు, న్యూస్‌టుడే: అధికార దాహంతో ప్రభుత్వ స్థలాలపై కన్నేసి.. అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా వైకాపా నాయకులు భవనాలు నిర్మించారు. రూ. లక్షల పెట్టుబడితో ఏళ్ల తరబడి ఆ భవనాలపై పెత్తనం చెలాయించి ఆదాయం గడించాలని భావించారు. ప్రజలు ఓట్లేసి అధికార మార్పిడి చేయడంతో వాటిని క్రమబద్ధీకరించుకునేందుకు ముప్పుతిప్పలు పడుతున్నారు. ఈ తంతు పలమనేరు పురపాలికలో జరిగింది.

ప్రజాప్రతినిధులే గుత్తేదారులుగా మారి

వైకాపా ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పాలకవర్గం తమ ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపట్టింది. ముగ్గురు కౌన్సిలర్లు, మరికొందరు నాయకులు కలిసి రూ. లక్షలు వెచ్చించి విలువైన పురపాలిక స్థలాల్లో వ్యాపార సముదాయాలు నిర్మించారు. నిబంధనల ప్రకారం పురపాలిక సొంత నిధులతో వాటిని నిర్మించి అద్దెలకు కేటాయించాలి. కానీ నాయకుల అండ ఉంటుందనే దీమా, ఆ దుకాణాలు వీరికే కేటాయిస్తారన్న హామీలతో కొందరు పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. పాలకవర్గం తీర్మానం చేయకుండా, మున్సిపల్ అధికారులు అనుమతి లేకుండా యథేచ్ఛగా పనులు కానిచ్చేశారు.

మూడు చోట్ల 15 గదుల నిర్మాణం

పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద 7 గదులు, బాలికోన్నత పాఠశాల వద్ద 4 గదులు, మున్సిపల్ కార్యాలయం రోడ్డు వద్ద మరో నాలుగు గదులు నిర్మించారు. ఒక్కో గదికి రూ. 3-5 లక్షలు వెచ్చించినట్లు సమాచారం. ఇవన్నీ ప్రభుత్వం మారడంతో నిరుపయోగంగా ఉన్నాయి. వాటిని క్రమబద్ధీకరించుకోవడానికి పలువురు వైకాపా పాలకవర్గ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో కొత్తగా వచ్చిన అధికారులు వాటిని క్రమబద్ధీకరించడానికి వెనకడుగేస్తున్నారు.

యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

సాధారణంగా వాణిజ్య నిర్మాణాలు చేపట్టాలంటే మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేయించాలి. దాన్ని జిల్లా అధికారులకు పంపి వారి నుంచి పరిపాలన ఆమోదం పొందాలి. అనంతరం గదుల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలి. దాన్ని వేలం పాట నిర్వహించి దక్కించుకున్న వారితో గుడ్‌విల్ పద్ధతిలో నిర్మాణాలు చేపట్టాలి. అందులో కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు గదులను కేటాయించాల్సి ఉంది. ఇక్కడ రెండేళ్ల కిందట వైకాపా ప్రభుత్వం ఉన్నందున ఇవేవీ పాటించకుండా అధికార భలం ఉన్న వారికి స్థలాలను కేటాయించేశారు. దాంతో వారే సొంతంగా భవనాలను నిర్మించేశారు. ఇప్పుడు వాటిని క్రమబద్ధీకరించుకోడానికి అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండు ఆనుకుని ఉన్న మున్సిపల్ స్థలంలో రాచకాలువ పరిమాణాన్ని తగ్గించేసి ఆ పక్కనే దుకాణాలను నిర్మించారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

ఈ విషయం ఇప్పుడే మా దృష్టికి వచ్చింది. నిబంధనలు పాటించలేదని తెలిసింది. పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి సూచనల మేరకు నడుచుకుంటాం.

– ఎన్వీరమణారెడ్డి, పురపాలిక కమిషనర్, పలమనేరు

బాధిత కుటుంబానికి నాయకుల పరామర్శ

పుంగనూరు, న్యూస్‌టుడే: కిడ్నాప్, హత్యకు గురైన పట్టణంలోని ఉబేదుల్లా కాంపౌండుకు చెందిన అస్పియా అంజుమ్ కుటుంబ సభ్యులను శుక్రవారం రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించారు. పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. నిందితులను అరెస్టు చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీలు నిర్వహించారు. చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని నిందితులను వదిలే ప్రసక్తే లేదని తెలిపారు.

సోమల, న్యూస్‌టుడే: అస్పియా అంజుమ్ విద్యార్థిని హతమార్చిన నిందితులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలంటూ నంజంపేటలో నమాజు అనంతరం పురవీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

బైరెడ్డిపల్లె: బాలిక అస్పియా మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి శుక్రవారం ముస్లిం సోదరులు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు.



పుంగనూరు: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మానవహారం



పెద్దపంజాణిలో ముస్లిం సోదరుల కొవ్వొత్తుల ర్యాలీ



సోమల: శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు